RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 00 | సంచిక: 0 | గురువారం, 05 డిసెంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధం

- గవర్నర్‌ను కలిసిన 'మహాయుతి' నేతలు
- బీజేపీ ఎల్‌పీ నేతగా ఫడ్నవిస్ ఎన్నికతో మూడోసారి ముఖ్యమంత్రిగా ఆయన పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగగమైంది
- గురువారంనాడు ముంబైలోని ఆజాద్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకారం కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు
- దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యమంత్రిగా, ఉప ముఖ్యమంత్రులుగా ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ నేత అజిత్ పవార్ ప్రమాణ స్వీకారం చేస్తారని బీజేపీ వర్గాల సమాచారం.



## శీతాకాలంలో వేడివేడిగా సమావేశాలు

- ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకు ప్రతిపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి.
- ఈ సారి అసెంబ్లీ సెషన్ కాస్త స్పెషల్‌గా ఉండే అవకాశం
- కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తాము చేసిన పనులను అసెంబ్లీ వేదికగా బలంగా వినిపించాలని అధికార పక్షం భావిస్తోంది.
- వన్ ఇయర్‌లో చేసిన అభివృద్ధిని అసెంబ్లీలో చర్చకు పెట్టబోతుందట
- ఏడాది కాలంలో రైతాంగానికి 58 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చినట్లు సభా వేదికగా వివరిస్తారట.



**హైదరాబాద్**

అసెంబ్లీ సమావేశాలకు అంతా రెడీ అవుతోంది. ఇటు అధికార పక్షం, అటు విపక్షాలు కూడా అందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నాయి. డిసెంబర్ 9 నుంచి జరగనున్న వింటర్ సెషన్‌లో అపోజిషన్‌ను కార్నర్ చేసేందుకు అధికారి పార్టీ.. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకు ప్రతిపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. దీంతో ఈ సారి అసెంబ్లీ సెషన్ కాస్త స్పెషల్‌గా ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తాము చేసిన పనులను అసెంబ్లీ వేదికగా బలంగా వినిపించాలని అధికార పక్షం భావిస్తోంది.వన్ ఇయర్‌లో చేసిన అభివృద్ధిని అసెంబ్లీలో

### ములుగు జిల్లాలోని ఏటూరు నాగారంకు ఆర్టీసీ డిపో మంజూరు – డిపో మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : మూడు రాష్ట్రాల సెంటర్ గా ఉన్న ఏటూరు నాగారం కి ఆర్టీసీ బస్సు డిపో మంజూరు కావటం పట్ల సీతక్క హర్షం ఏటూరు నాగారం నగరంలో బస్సు డిపో మంజూరు కావడంతో ఏజెన్సీ ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్న సీతక్క తెలిపారు. సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ధన్యవాదాలు తెలిపిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ములుగు డిసిసి అధ్యక్షులు పైడాకుల అశోక్.



# ప్రగతి పథంలో నడిపించడమే ఎజెండా

**ఏడాదిలోపు 55,143 ఉద్యోగ నియామకాలు పూర్తి**

- గడిచిన పదేండ్లలో అభివృద్ధికి నోచుకోని ఎన్నో కార్యక్రమాలను చేపట్టాము
- సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమైన నిరుద్యోగ సమస్య పరిష్కారం, రైతాంగానికి అండగా నిలవడం, మహిళలను ప్రగతి పథంలో నడిపించడమే ఎజెండాగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



వివరించారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి సమగ్రంగా వివరించారు.

## సింహాల్లా పోరాడుతున్న మా కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

. మరో నాలుగేండ్లు ఈ పోరాటాన్ని ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని

కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కొన్ని అబద్దాలు పదేపదే వల్లె వేస్తుంటే బాధ అనిపిస్తుంది

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నిన్నటికి సంవత్సరం అయింది

ఈ రోజు తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌గా మారింది

హైడ్రా, మూసీ బాధితులతో పాటు పలువురు క్యూ కడుతున్నారు.



**హైదరాబాద్**

కార్యక్షేత్రంలో ప్రతి రోజు కాంగ్రెస్ ప్రభుత్వంతో తలపడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలకు, కేసులకు వెరవకుండా సింహాల్లా పోరాడుతున్న మా పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరో నాలుగేండ్లు ఈ పోరాటాన్ని ఉధృతంగా ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు కొన్ని అబద్దాలు పదేపదే వల్లె వేస్తుంటే బాధ అనిపిస్తుంది. ఒక అబద్దాన్ని వందసార్లు చెప్తే నిజమైపోతదనే నానుడి .

## హైడ్రా మరో కీలక నిర్ణయం

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆక్రమణలపై ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని నిర్ణయించింది. ఈమేరకు కొత్త ఏడాదిలో ప్రతీ సోమవారం బుద్ధభవన్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలపై అర్జీలు ఇవ్వొచ్చని హైడ్రా పేర్కొంది.





### ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సును మార్చే ప్రతిపాదన లేదు

- ఉద్యోగుల పదవీ విరమణ వయస్సుపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం
- ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 ఏండ్లుగా ఉన్నది
- యువతకు ఉపాధి కల్పించే విధానాలు, కార్యక్రమాలను రూపొందించడంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది

## ములుగు ఎన్కౌంటర్ బూటకం

- ఎన్కౌంటర్ లు లేని తెలంగాణను నిర్మించాలి
- ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్: డిసెంబర్ ఒకటిన జరిగిన ఎన్కౌంటర్లో మృతి చెందిన వారికి అన్నంలో విషం పెట్టి చిత్రహింసలకు గురిచేసి, అతి కిరాతకంగా హత్య చేశారని ప్రొఫెసర్ హరగోపాల్అన్నారు. ఈ ఎన్కౌంటర్ జరిగిన వెంటనే ప్రజల నుండి వచ్చిన సమాచారం ప్రకారం అన్నంలో విషం కలిపి హత్య చేసినట్లుగా తెలియు వచ్చిందని,అదే నిజమని ఎన్కౌంటర్ మృతుల శరీరాలను బట్టి అర్థమవుతున్నది మృతుడు మధు శవాన్ని వారి సహచరి మీన చూసిన తర్వాత వాస్తవాలు ఇంకా అర్థం అయ్యాయని ఆయన స్పష్టం చేశారు. ఎన్కౌంటర్ అంటే ఎదురుకాల్పులుగా ఇంతకాలం చరిత్ర సాగింది.



# సంపాదకీయం

## జీవబలం కోల్పోతున్న పుడమితల్లి

సృష్టిలోని సమస్త జీవరాశి మనుగడకు కావాల్సిన ఆహారాన్ని, ఆవాసాన్ని అందించేది నేల తల్లి. జీవనధాతువుగా నిలవాల్సిన ఆ నేలతల్లే మానవుని స్వార్థపూరిత చర్యల వల్ల వెదజల్లబడుతున్న కాలుష్యం వల్ల తల్లడిల్లుతోంది. అభివృద్ధి పేరుతో మానవుడు చేపడుతున్న అనేక స్వార్థపూరిత చర్యల వల్ల పర్యావరణం గతంలో ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. వాతావరణంలోకి నిత్యం పెద్ద ఎత్తున విడుదలవుతున్న కలుషితాల వల్ల ఋతువులు గతి తప్పాయి. సహజవనరులు తమ సహజత్వాన్ని కోల్పోతున్నాయి. కోట్లాది ఎకరాల సాగు భూములు తమ సారాన్ని కోల్పోయి బీడు భూములుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పచ్చిక బయళ్లు ధ్వంసం కావటం వల్ల కూడా మేత లేక ఏటా లక్షలాది పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఆ మూగ జీవాలను రక్షించుకోవాలంటే నేల క్షీణతను అరికట్టి, తిరిగి ఆ హరిత భూములను పునరుద్ధరించటం ఒకటే మార్గమని పర్యావరణవేత్తలు హితవు పలుకుతున్నారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం ప్రపంచ నేల దినోత్సవాన్ని 'నేలల సంరక్షణ : మెజర్, మానిటర్ అండ్ మేనేజ్' అనే థీమ్‌తో జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఒ) ప్రపంచ దేశాలను కోరింది. భూమిని పుడమితల్లిగా పూజించే భారత్ వంటి దేశాలలో కూడా నేల క్షీణత, ఎడారీకరణ అత్యంత వేగవంతంగా సాగుతున్నాయి. వాతావరణ మార్పులు, మానవ ప్రేరిత చర్యల వల్ల భారతదేశంలో 32 శాతం నేల క్షీణతకు గురవుతుండగా, 25 శాతం భూమి ఎడారిగా మారిపోతుందని భారత కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంలో 2015 నుండి 2019 వరకూ అంటే నాలుగు సంవత్సరాల కాలంలో సుమారు 30.51 మిలియన్ హెక్టార్ల భూమి క్షీణతకు గురై బీడుబారిపోయిందని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ (యుఎన్‌సిసిడి) అనే సంస్థ తన నివేదికలో అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం 2019 నాటికే దేశ భూభాగంలో సుమారు 9.45శాతం భూమి క్షీణతకు గురయ్యింది. 2023లో యుఎన్‌సిసిడి విడుదల చేసిన తాజా నివేదికలో భారతదేశ జనాభాలో దాదాపు 18.39 శాతం మంది ప్రజలు భూక్షీణత, ఎడారీకరణ వల్ల అనేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. అహ్మదాబాద్‌లోని ఇస్రో స్పేస్ అప్లికేషన్ సెంటర్ 2021లో విడుదల చేసిన డిసర్టిఫికేషన్ అండ్ ల్యాండ్ డిగ్రేడేషన్ అట్లాస్ ఆఫ్ ఇండియా ప్రకారం దేశంలో సుమారు 96.40 మిలియన్ హెక్టార్లు భూమి అంటే దేశ భౌగోళిక విస్తీర్ణంలో 29.32 శాతం భూమి క్షీణతకు గురయ్యిందని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 9రాష్ట్రాలలో భూమి క్షీణత అధికంగా కనిపిస్తుందని, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, జమ్మూ అండ్ కాశ్మీర్, కర్ణాటక, జార?ండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 23.95 శాతం భూమి క్షీణతకు గురవుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. జార?ండ్, రాజస్థాన్, ఢిల్లీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాలలో విస్తీర్ణంలో 50శాతం కన్నా ఎక్కువ భూమి ఎడారీకరణకు గురవుతుంటే, కేరళ, అస్సాం, మిజోరం, హర్యానా, బీహార్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కేవలం 10 శాతం కన్నా తక్కువ విస్తీర్ణంలో భూములు ఎడారీకరణకు గురవుతున్నాయని ఈ నివేదిక తెలియచేసింది. భారతదేశంలో ఎడారీకరణకు, నేల క్షీణతకు హరిత విప్లవం పేరుతో అనుసరించిన విధానాలు కూడా ఒక ప్రధాన కారణమే. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి సాధించాలన్న లక్ష్యంతో ప్రారంభమైన హరిత విప్లవం నేడు నేలను నిర్జీవంగా మార్చే ప్రక్రియకు ప్రధాన కారణమవుతుంది. విచ్చలవిడిగా రసాయినిక ఎరువుల వినియోగం, యాంత్రిక వ్యవసాయీకరణ, ఏకరూపక వ్యవసాయ సంస్కృతి మన దేశానికి హరిత విప్లవం అందించిన విధానాలు. ఇవే ఇప్పుడు నేలతల్లి పాలిట శాపాలుగా మారుతున్నాయి. దేశవ్యాప్తంగా హరిత విప్లవ కాలంలో అనుసరించిన వ్యవసాయిక విధానాల వల్ల నేల నిర్మాణం పూర్తిగా మారిపోయింది. దీంతో పాటు అభివృద్ధి పేరుతో పెద్దయెత్తున సాగుతున్న అటవీ విధ్వంసం, అడ్డు అదుపూ లేకుండా సాగుతున్న పట్టణీకరణ వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేస్తున్నాయి. ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (థేరీ) అంచనా ప్రకారం నేల క్షీణత వల్ల భారతదేశం ఏటా 48.8 బిలియన్ డాలర్ల మేరకు ఆర్థికంగా నష్టపోతుందని స్పష్టం చేసింది. భారతదేశం కూడా భూమి క్షీణతను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని 2015లో పారిస్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమెట్ ఛేంజ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ సదస్సులో ప్రకటించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 26 మిలియన్ హెక్టార్ల నేలని తిరిగి పునరుద్ధరించే లక్ష్యంతో కాప్ పార్టీస్ చేపట్టిన బాన్ ఛాలెంజ్‌లో భారతదేశం భాగస్వామిగా చేరింది. అయితే దేశంలో వేగంగా విస్తరిస్తున్న ఎడారీకరణ, భూక్షీణతను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఒక స్పష్టమైన విధానం ఇప్పటికీ లేకపోవటం విచారకరం.

# రాజ్యాంగ విలువలకు పట్టంగట్టిన తీర్పు!

దేశంలో 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భాన భారత రాజ్యాంగ పీఠికలో సోషలిజం (సామ్యవాదం), సెక్యులరిజం (లౌకికవాదం) అంతర్భాగమని పునరుద్ఘాటిస్తూ సుప్రీంకోర్టు కీలక మైలురాయి లాంటి తీర్పు వెలువరించింది. రాజ్యాంగ పీఠికలో ఈ సూత్రాలు ఉండటాన్ని సవాల్ చేస్తూ డాక్టర్ బల్‌రాం సింగ్‌తో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టివేయడం విశేషం. ఈ పిటిషన్‌దారుల్లో బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యన్‌స్వామి కూడా ఒకరు కావడం గమనార్హం. సుప్రీంకోర్టు వెలువరించిన ఈ తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలు, విలువలను తెలియజేస్తున్నది. అంతేకాదు, భారతదేశపు ప్రజాస్వామ్య, భిన్నత్వంలో ఏకత్వం, సమ్మిళితత్వాన్ని రూపొందించడంలో వాటి ప్రాధాన్యాన్ని ఈ తీర్పు నొక్కిచెప్తున్నది. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత రాజ్యాంగ పీఠికలో సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలను చేర్చారు. ఇది భారత రాజ్యాంగ చరిత్రలో చరిత్రాత్మక ఘటన. మన దేశం రాజకీయ, ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న సమయంలో ప్రవేశపెట్టిన ఈ సూత్రాలు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కట్టుబడి ఉన్న ఆదర్శాలకు, నిబద్ధతలకు ప్రతీకలు. ఈ సూత్రాలు రాజ్యాంగ పీఠికలో చేర్పులు మాత్రమే కాదు, భారతీయ నైతిక విలువలు, రాజకీయపరమైన చర్చల్లో లోతుగా పాతుకుపోయిన విలువలకు అధికారిక ఆమోద ముద్ర అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగ పీఠికతో సహా రాజ్యాంగాన్ని సవరించే హక్కు నిస్సందేహంగా పార్లమెంట్‌కు ఉన్నదని సుప్రీంకోర్టు ఈ కేసు విచారణ సందర్భంగా పేర్కొన్నది. అయితే, ఈ సూత్రాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘించాయని లేదా అసలు ఉద్దేశాన్ని అవి వక్రీకరించాయనే వాదనను ఉన్నత న్యాయస్థానం కొట్టిపారేసింది. అంతేకాదు, ఆర్టికల్స్ 14, 15, 16, 25-30 సమానత్వం, వివక్ష లేకపోవడాన్ని, మత స్వేచ్ఛను కల్పిస్తున్నట్టే లౌకికవాదం అనేది అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని న్యాయస్థానం నొక్కిచెప్పింది. అలాగే దేశంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల పెట్టుబడులను అనుమతించడం ద్వారా మిశ్రమ ఆర్థిక నమూనాతో సామాజిక, ఆర్థిక న్యాయం పట్ల దేశం నిబద్ధతను సామ్యవాదం ప్రతిబింబిస్తుంది. ఎమర్జెన్సీ సమయంలో తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ చట్టబద్ధతపై తలెత్తుతున్న ఆందోళనలను కూడా సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. ఆ తర్వాత 44వ రాజ్యాంగ సవరణ సందర్భంగా పార్లమెంట్‌లో జరిగిన చర్చలో ఈ సూత్రాలను పునరుద్ఘాటించినట్టు న్యాయస్థానం గుర్తుచేసింది. సామ్యవాదం, లౌకికవాదం అనే సూత్రాలు భారత రాజ్యాంగ నైతిక విలువల్లో లోతుగా పాతుకుపోయాయనీ, అవి భారత రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో అంతర్భాగమని కోర్టు చెప్పింది. 'మనమంతా భారతీయ ప్రజలం' అనే ఆకాంక్షలను ప్రతిబింబించేలా పీఠికను సజీవ సాక్ష్యంగా న్యాయవ్యవస్థ గుర్తించిందని చెప్పడానికి ఈ తీర్పు తార్కాణం. భారత రాజకీయ, ఆర్థిక, విధానపరమైన నిర్ణయాలు, చర్చల్లో సామ్యవాదం కీలకపాత్ర పోషిస్తున్నది. ఈ సూత్రాన్ని మన దేశం అవలంబించిన నాటి నుంచి సమకాలీన సంక్షేమ విధానాల అమలులో సామ్యవాదం మార్గనిర్దేశక శక్తిగా ఉన్నది. ముఖ్యంగా 1980లో బొంబాయి వేదికగా బీజేపీని స్థాపించినప్పుడు ఆ పార్టీ గాంధేయ సోషలిజాన్ని తమ వ్యవస్థాపక సూత్రాల్లో ఒకటిగా స్వీకరించింది. గాంధేయ సోషలిజం బీజేపీ సైద్ధాంతిక మూలస్తంభమని ఆ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అటల్ బిహారీ వాజపేయి విస్పష్టంగా ప్రకటించారు. సోషలిజం రాజకీయాలకతీతమని, భారత పాలనలో ఏకీకృత ఆదర్శంగా ఇది మిగిలిపోతుందని చెప్పడానికి ఇది నిదర్శనం. 1990వ దశకంలో ఆర్థిక సరళీకరణలు, సంస్కరణలు వచ్చినప్పటికీ, దేశంలోని అనేక రాజకీయ పార్టీలు సోషలిస్టు ఆదర్శాలకు కట్టుబడి ఉన్నాయి. సమాజ్‌వాదీ, ఆర్జేడీ, జేడీయూ, జేడీఎస్ వంటి ప్రాంతీయ అస్తిత్వ శక్తులు సోషలిజం పట్ల తమ నిబద్ధతను చాటుకున్నాయి. అంతేకాదు, సోషలిస్టు సూత్రాల ప్రకారం.. ఆయా పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలు తమ సంక్షేమ విధానాలను రూపొందించి, అమలు చేశాయి కూడా. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ గతంలో నక్సలైట్లను దేశభక్తులుగా అభివర్ణించారు. సోషలిజం ప్రభావానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. సంప్రదాయేతర నెరేటివ్స్‌లోనూ సోషలిజం సూక్ష్మ, విస్తృత ప్రభావానికి ఇది నిదర్శనం. ఈ సైద్ధాంతిక నిబద్ధత మన దేశంలో సంక్షేమ నమూనాకు కూడా విస్తరించింది. వనరులు, అవకాశాల సమాన పంపిణీకి ఇది ప్రాధాన్యమిస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, పీఎం కిసాన్ యోజన, మహారాష్ట్రలో అమలవుతున్న లడ్కీ బహీన్ యోజన వంటి పథకాలు సోషలిజానికి ఆధునిక మేనిఫెస్టోలాంటివి. అసమానత్వాన్ని రూపుమాపేందుకు, సామాజిక న్యాయం చేసేందుకు సామ్యవాదమే పరిష్కార మార్గం. ఎవరూ ఔనన్నా, కాదన్నా భిన్నత్వంలో ఏకత్వం, వైవిధ్యతలతో కూడిన భారత్‌కు లౌకికవాద దేశమనే గుర్తింపు అనివార్యం. 2011 జనాభా లెక్కలే అందుకు నిదర్శనం. 2011 జనగణన ప్రకారం%-% దేశంలో 79.8 శాతం హిందువులు, 12 శాతం ముస్లింలు, 2.3 శాతం క్రైస్తవులు, 1.7 శాతం సిక్కులు, 0.7 శాతం బౌద్ధులు, 0.4 శాతం జైనులు, మిగిలిన శాతం ఇతరుల మతాలను ఆచరించేవారున్నారు. ఈ మతపరమైన బహుళత్వం 22 అధికారిక భాషలు, వందలాది మాండలికాలతో కలిపి దేశంలో సంపూర్ణంగా విస్తరించి ఉన్నది. ఇలాంటి వైవిధ్య సమాజంలో లౌకికవాదం అందరినీ ఏకం చేసే సూత్రంగా పనిచేస్తుంది. తమ విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే వ్యక్తుల హక్కులను కాపాడుతూ, దేశం అన్ని మతాలను గౌరవిస్తుందని ఇది తెలియజేస్తుంది. సామరస్యాన్ని, సమానత్వాన్ని పెంపొందించే ప్రత్యక్ష వాస్తవికతే లౌకికవాదం. విభిన్న పండుగలను కలిపి జరుపుకోవడం నుంచి పాలనలో వివిధ వర్గాల ప్రాతినిధ్యం వరకు లౌకికవాదం భారతదేశ నైతికతలో లోతుగా పాతుకుపోయింది. అయితే, మన దేశంలో లౌకికవాదం భవిష్యత్తులోనూ పరిఢవిల్లాలంటే అప్రమత్తత అవసరం. దేశంలో అక్కడక్కడ జరిగే మత విభేదాల ఘటనలు ఈ ఆదర్శ సూత్రాన్ని సవాలు చేస్తాయి. లౌకికవాదం మరింత కాలం మనుగడ సాగేందుకు పౌరసంస్థలు, రాజకీయ నాయకులు ప్రయత్నించాలి. సుప్రీంకోర్టు లౌకికవాదాన్ని పునరుద్ఘాటించడం, భిన్నత్వం మధ్య భారతదేశం ఏకత్వాన్ని కాపాడటంలో దాని పాత్రను గుర్తు చేస్తుంది. సామ్యవాదం, లౌకికవాదం అనేవి కేవలం సాధారణ పదాలు కావని, అవి భారత రాజ్యాంగానికి ఆధారమైన ప్రాథమిక సూత్రాలని సుప్రీంకోర్టు తీర్పు తెలియజేస్తున్నది. బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామితో పాటు ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేస్తూ%-% ఈ విలువలు రాజ్యాంగ మౌలిక సూత్రాలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి నకళ్ల వంటివని, అవి వాటితో సరిగ్గా సరిపోతాయని న్యాయస్థానం నొక్కి చెప్పింది.

ఈ తీర్పు రాజ్యాంగ అనుకూలతను కూడా తెలియజేస్తున్నది. ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని చెప్తూనే, 42వ రాజ్యాంగ సవరణను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ, లౌకికవాదం, సామ్యవాద సూత్రాలను పలుచన చేసే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని న్యాయస్థానం కుండబద్దలు కొట్టి మరీ చెప్పింది. ఆర్థిక న్యాయం, సామాజిక సమానత్వం, మత సామరస్యాన్ని పెంపొందించేందుకు సామ్యవాదం, లౌకికవాదం అవసరమనే శక్తిమంతమైన సందేశాన్ని ఈ తీర్పు ఇస్తున్నది. ఈ సూత్రాలు గతానికి సంబంధించినవి మాత్రమే కావు.. శక్తివంతమైన, సమ్మిళిత ప్రజాస్వామ్యంలో కీలకమైన భాగాలు కూడా. ఈ సూత్రాలు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ ప్రయాణాన్ని రూపొందించాయి. సామాజిక సంక్షేమం, మత సామరస్యానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా అవి సమగ్రతను, పురోగతిని ప్రోత్సహించే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడంలో కీలకపాత్ర పోషించాయి. అందువల్ల ఈ తీర్పు చట్టపరమైన మైలురాయి మాత్రమే కాదు, రాజ్యాంగ విలువలకు భారతదేశ నిబద్ధతను కూడా తెలియజేస్తున్నది.

# కులగణనతో దేశానికి హాని ఏమిటి?

'ఈ విభజనలతో దేశం ఏమయ్యేట్టు?' శీర్షికన కె.అరవిందరావు 23 నవంబర్ 2024న రాసిన వ్యాసానికి ప్రతిస్పందన ఇది. అరవిందరావు పదవీ విరమణ తర్వాత దైవకార్యంలో భాగంగా సామాజిక పరిణామాల మీద వార్తా పత్రికల్లో స్పందిస్తూ ఉంటారు. ఈ వ్యాసంలో ఆయన దళిత బహుజన, మత మైనార్టీ వర్గాల్లో వస్తున్న చైతన్యం మీద తన అక్కసును వెళ్ళకక్కే ప్రయత్నం చేశారు. ఈ వర్గాల్లో వస్తున్న చైతన్యాన్ని ఇలానే సాగనిస్తే దేశ విభజన, హిందూమత విధ్వంసానికి దారితీస్తుందని హెచ్చరించారు. అరవిందరావు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోను, దేశంలోను జరుగుతున్న కులగణనను, మత మైనార్టీల పట్ల పార్టీల, ప్రభుత్వాల సాఫ్ట్ కార్నర్‌ను వ్యతిరేకిస్తూ ఆ వ్యాసాన్ని వ్రాసారు. ఆయన అభిప్రాయాల ప్రకారం కులగణన సమాజంలో కులతత్వాన్ని ప్రేరేపిస్తుంది. కులగణనతో కులతత్వం వికృతరూపం తీసుకుంటుందని చెప్పారు. ఇది ఒక అగ్రకుల తత్వంతో కూడిన వాదన. భారతీయ సమాజం కుల పునాదుల మీద నిర్మించబడి ఉంది. ఇందులో కొత్తగా చెప్పేది ఏమిలేదు. కులగణన వల్లనో, కులం గురించి మాట్లాడటం వల్లనో కులతత్వం పెరగదు. నా కులానికి అన్యాయం జరిగిందనటం కులతత్వం ఎట్లా ఐతది? అసలు కులతత్వం అంటే ఏమిటి? క్రింది కులాలను అవమానించి, అణగదొక్కి, దోపిడీ చేసే అగ్రకుల మనస్తత్వాన్ని కులతత్వంగా చెప్పుకోవచ్చు. ఈ దేశంలో దోపిడీ కులసంబంధాల ద్వారానే జరుగుతున్నది. ఆర్థిక సంబంధాల ద్వారా కాదు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. ఈ దేశ ప్రజాస్వామ్యం, అర్థిక అభివృద్ధి అగ్రకుల ఆధిపత్యం భూమికగా నిర్మించబడ్డాయి. ఈ రోజు దళిత బహుజన వర్గాలు అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తున్నాయి. దీన్నే అగ్రకులాలు కులతత్వంగా చిత్రిస్తున్నాయి. మరి అగ్రకులాలు కులాల వారి మ్యారేజీ బ్యూరోలు పెట్టుకోవటాన్ని, కులాలవారి జాబ్ మేళాలు నిర్వహించటాన్ని, చెప్పుకుంటూ పోతే ఇలా చాలానే ఉన్నాయి. మరి వీటిని ఏమనాలి? దీన్ని కులతత్వం అనరా? ఇది కదా దేశ ఐక్యతకు భంగం. అరవిందరావు తన వ్యాసంలో కులం, హిందూ మతానికి సంబంధించి కొన్ని చారిత్రక, పురాణ విషయాల్ని ప్రస్తావించారు.

అవి చాల అవగాహనరాహిత్యంగా ఉన్నాయి. మొదటిది- హిందూమతానికి కులంకు సంబంధం లేదనటం. హిందు శాస్త్రాల్లో కేవలం నాలుగు వర్ణాలే చెప్పబడ్డాయి, తరువాత వృత్తుల ఆధారంగా అనేక కులాలు పుట్టుకువచ్చాయి, యూరోపియన్ సమాజంలోను ఈ తరహా పరిణామాలు చూడవచ్చని చెప్పారు. ఈ వాదనను అగ్రకులాలు జాతీయ ఉద్యమ కాలం నుండి చెప్పుకుంటూ వస్తున్నాయి. వారికి అర్థం అయ్యి అర్థం కాని విషయం ఏమంటే వర్ణవ్యవస్థ అనేది ఒక భావజాలం ఈ భావజాలం కులవ్యవస్థ మొత్తానికి పునాది. వాస్తవానికి వేదకాలంలో మూడు వర్ణాలే ఉండేవి. తరువాత ఈ వర్ణాలు కూడ కులాలుగా మారిపోయినాయి. యూరప్‌లో ఏర్పడిన వృత్తి ఆధారిత సమూహాలకు ఇండియా కులవ్యవస్థకు జమీన్ అస్మన్‌కు ఉన్నంత ఫరక్ వుంది. అక్కడి వృత్తి సమూహాల మధ్య నిచ్చనమెట్ల వ్యవస్థ లేదు, వైషమ్యాలు లేవు, అవమానాల్లేవు, అన్నింటికీ మించి అంటరానితనం లేదు. మన కుల వ్యవస్థ ప్రత్యేక లక్షణం ఏమంటే అగ్రకులాలవారు దోపిడిదారులుగా గర్వపడుతారు.

.

ఈ భావజాలం ఏ సమాజంలో లేదు. ఒక్క మన దేశంలోనే వుంది. వైదిక మతస్థులు గొప్పగా చెప్పుకునే మరో విషయం ఏమంటే తమ మతం ఇతర మతాల్లా విదేశాల మీద దండెత్తలేదని, ఇతర మతస్థులను తమ మతంలోకి మార్చలేదని. ఇది వాస్తవమే. అయితే వైదిక మతం ఇతర దేశాలకు ఎందుకు విస్తరించలేదన్న ప్రశ్న ఎప్పుడైనా వేసుకున్నారా? ఈ దేశంలో పుట్టిన జైన, బౌద్ధ మతాలు ఇతర దేశాలకు ఎలా విస్తరించాయి? అంటే ఈ మతాలు సార్వజనీన మానవ విలువల మీద ఏర్పడ్డాయి కాబట్టి. వైదిక మతం సహజ ప్రకృతి ధర్మంకు వ్యతిరేకం. వైదిక మతానికి కులం మూలం. పరదేశీయులు ఈ మతంలోకి మారాలంటే అతనికి కులం ఉండాలి. సప్తమునుల్లో ఎవరో ఒకరితో జన్మ వంశం / గోత్రం సంబంధం కలిగి ఉండాలి. ఈ కారణంగానే వైదిక మతం ఇతర దేశాలకు విస్తరించలేదు. అరవిందరావు చేసే మరో ఆరోపణ ఏమంటే బ్రిటిష్ వారి వల్లనే ఈ దేశంలో ప్రజలు కులాలుగా, మతాలుగా, విడిపోయారని. అసలు విషయం ఏమంటే ఈ రోజు మాట్లాడుకుంటున్న హిందూ మతం బ్రిటిష్‌వారు చేపట్టిన జనగణన నుండి పుట్టింది. అరబిక్ రచయిత అల్ బైరుని మొదటగ 'హిందూ' పదాన్ని భౌగోళిక అర్థం స్ఫురించేట్లు వాడినారు. తరువాత కాలంలో ఈ దేశ భాష సంస్కృతులను పరంగా వాడుకలో వచ్చింది. బ్రిటిష్ పాలకులు జనాభా గణన చేసినపుడు ముస్లిం, క్రిస్టియనేతరులను హిందువులుగా గుర్తించటం జరిగింది. దానితో దేశంలోని అనేక స్థానిక మత ఆచారాలు, దేవుళ్ళు హిందూ మతం క్రిందికి తీసుకురావటం జరిగింది. 19వ శతాబ్ది వైదిక సాంస్కృతిక ఉద్యమం దానికి తోడైంది. అయితే వైదిక మతం భావజాలం హిందూమత భావజాలంగా చలామణీలోకి వచ్చింది. వాస్తవానికి వైదికమతంకు ప్రాంతీయ దేవుళ్ళు, దేవతలకు ఎటువంటి సంబంధం లేదు. ఇక్కడి కొమురవెల్లి మల్లన్నకు, వీరభద్రుడికి, ఎల్లమ్మ, మైసమ్మలకు, గోండుల నాగోబాకు, లంబాడీల మెరామ్మకు, చెంచు మల్లయ్య (శ్రీశైలం)కు వైదిక మతంకు ఏ సంబంధం లేదు. వీరంతా దళిత బహుజనుల పక్షాన పోరాటం చేసి వీరమరణం చెందినవారు. ప్రజలు వారిని అనాదిగా పూజించుకుంటూ వస్తున్నారు. ముస్లింల సాధికారత గురించి ప్రభుత్వాలు, పార్టీలు మాట్లాడటం పట్ల అరవిందరావు అసహనం ప్రకటించారు. ప్రధానంగా రెండు ఆరోపణలు చేశారు. ఒకటి ముస్లింల వల్లనే ఇండియా రెండుగా విడిపోయిందనిబీ రెండవది ముస్లింల పట్లా ఉదారవాదం చూయిస్తే ఈ దేశం ఏదో ఒక రోజున ఇస్లామిక్ దేశంగా మారిపోతుందని. ఈ రెండు ఆరోపణలు అవగాహనా రాహిత్యంతో చేసినవే. జాతీయ ఉద్యమంలో భాగంగా వచ్చిన హిందూ ఫాసిజమె దేశ విభజనకు కారణమని ఈ మధ్య కాలంలో వచ్చిన పరిశోధనలు వివరిస్తున్నాయి. హిందూ ఫాసిజం బెంగాల్ విభజనతో మొదలై 1920 నాటికి వికృత రూపం తీసుకుంది. ఈ పరిస్థితిలో ముస్లింలోని ఒక వర్గం హిందూ ఆధిపత్య ఇండియాలో మనుగడ సాగించలేమన్న భావానికి వచ్చింది. చివరి వరకు వారు ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తిని కోరుకున్నారు. కానీ, హిందూ నాయకులు ముస్లింలకు స్వయంప్రతిపత్తి ఇవ్వటం కంటే దేశ విభజనే మంచిదని భావించారు. మరి దేశ విభజనకు ఎవరు కారణం? హిందువులా? ముస్లింలా? ఝస్లింలను ఒక బూచిగ చూయించి, హిందువుల్లో ఒక భయాన్ని సృష్టించి వారిని ఓటు బ్యాంకుగా మార్చుకునే విధానాన్ని బీజేపీ, దాని మాతృసంస్థలు మొదటి నుండి చేస్తున్నాయి. వాస్తవంగా ముస్లింల భయం సృష్టితోనే హిందూయిజం నిర్మాణం జరుగుతుంది. అదే ప్రయత్నాన్ని అరవిందరావు తన వ్యాసంలో చేశారు. ఒక్క విషయం ఏమంటే ఈ దేశాన్ని ముస్లింలు 550 సంవత్సరాలు పాలించారు. అయినా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చలేకపోయారు. ఇప్పుడు రోజువారి జీవితమే కష్టంగా గడుపుతున్న ఆ మైనార్టీ వర్గం ఎలా ఈ దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చగలదు? అసలు ముస్లింలు ఎవరు? ఈ దేశ దళిత, బహుజన బిడ్డలు కాదా? బైటినుండి వచ్చినవారు మహా అయితే ఓ 10శాతం ఉండవచ్చు. కాని 90శాతం ఇక్కడి బిడ్డలేకదా. మరి వారి సాధికారత గురించి పట్టించుకోవాల్సిన బాధ్యత అన్ని పార్టీలకు, ప్రభుత్వాలకు ఉండకూడదా!?

# ఈనెల 6న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులు రేపాల వెంకటేశ్వర్లు

కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ : మారేడుపల్లి లోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పాలకమండలి నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఈనెల 6 వ తేదీన నిర్వహించినట్లు నూతనంగా ఎన్నికైన పాలక మండలి సభ్యులు రేపాల వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నూతన పాలకమండలి సభ్యుల పేర్లను వెల్లడించారు . ప్రమాణ స్వీకారం చేయనున్న నూతన పాలకమండలి సభ్యులుగా పి నర్సింగ్ రావు, ఎం రామ్మోహన్, కె పరమేష్, కె పద్మజ ,పి బాలరాజ్ ,పి శ్రీనివాస్ ,ఎక్స్ అఫీషియల్ మెంబర్ టి రాజేశ్వర్ శర్మ, పేర్లను ప్రకటించారు 6 వ తేదీన ఆలయ ఆవరణలో చైర్మన్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. పాలకమండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించిన కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ గణేష్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.


# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది



*2 కోట్ల 36 లక్షల రూపాయల విలువైన చెక్కులను మహిళా గ్రూపులకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్*

కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సాధికారిక కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. బుధవారం మారేడ్‌పల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సంబరాలలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళల స్వయం సహాయక గ్రూపు లకు ప్రభుత్వం ఇచ్చే వడ్డీలేని రుణాలను ఎమ్మెల్యే శ్రీ గణేష్ పంపిణీ చేశారు. మొత్తం 24 గ్రూపులకు చెందిన 240 మంది మహిళలకు మొత్తం 2 కోట్ల 36 లక్షల రూపాయల విలువైన చెక్కులను మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అందజేస్తూ మహిళలను రాష్ట్ర అభివృద్ధి లో భాగస్వామ్యులను చేస్తుందని అన్నారు. అలాగే తెలంగాణ లో మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని, వారి కాళ్ల మీద వారు నిలబడాలని, మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశ్యంతో సర్కారు పనిచేస్తుందని అన్నారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, వారి వ్యాపారాలకు అవసరమైన రుణాలను అందజేస్తూ ప్రోత్సాహన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈవో పల్లవి ,మెప్మా అధికారి ప్రకాష్, బోర్డ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ చౌహాన్ ,నాయకులు ముప్పిడి మధుకర్, బద్రీనాథ్ ,సంకి రవీందర్, సి వైష్ణవి, శ్యాంసుందర్ రెడ్డి ,గౌరీ శంకర్, నంది కంటి రవి, సంతోష్ యాదవ్, నాగినేని సరిత, రేపాల వెంకటేశ్వర్లు, బాబురావు, బ్యాంకు అధికారులతో పాటు వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

# మంచినీటి పైప్ లైన్ పనులు ప్రారంభించిన రామకృష్ణ



కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ 6 వ వార్డు పరిధిలోని మహా మాతాజీ నగర్, భావన కాలనిలో బుధవారం కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జన్యావుల రామకృష్ణ త్రాగునీటి పైప్ లైన్ నిర్మాణా పనులకు శంకుస్థాపన చేశారు .బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బస్తీ బాట కార్యక్రమంలో స్థానిక ప్రజలు మంచినీటి పైప్ సమస్యను తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, వారి సమస్యను పరిష్కరించేందుకు నేడు త్రాగునీటి పైప్ లైన్ నిర్మాణాన్ని ప్రారంభించామని అన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి బిజెపి కట్టుబడి పని చేస్తుందని, ఎన్నడూ లేనివిధంగా గత పది సంవత్సరాలుగా కంటోన్మెంట్ లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కానీ మాటలు చెప్పి మోసం చేశారు కానీ నిధులిచ్చి అభివృద్ధి చేసిన పాపాన పోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు అజయ్ గౌడ్, బిజెపి నాయకులు ప్రతీక్ జైన్, భీమరాజం, వేణు, గంగాధర్, సుదర్శన్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా వేముల గోపీనాథ్



నల్గొండ, తెలంగాణ సేన న్యూస్ : నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన వేముల గోపీనాథ్ ఇటీవల తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం వెలువడిన ఫలితాలలో ఓపెన్ క్యాటగిరిలో తుంగతుర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా గోపీనాథ్ ఎన్నికయ్యారు . ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూత్ కాంగ్రెస్ నాయకులకు మిత్రులకు శ్రేయోభిలాషులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలను తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు యువతకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వేముల గోపినాథ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

# ములుగు జిల్లా ప్రజలకు ఎట్టకేలకు తీరిన చిరకాల వాంఛ

***ఏటూరు నాగారం ఆర్టీసీ డిపో మంజూరుతో ప్రజల హర్షం మంత్రి సీతక్క కృషికి జిల్లా ప్రజల కృతజ్ఞతలు***



**ములుగు జిల్లా, తెలంగాణ సేన న్యూస్ :** ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఏటూరునాగారం మంగపేట తాడువాయి గోవిందరావుపేట తదితర మండలాలకు వెళ్లే ప్రజలకు ఆర్టీసీలో ప్రయాణం ప్రత్యక్ష నరకంగా మారింది బస్సులో సీటు కోసం నిత్యం కుస్తీలు పడుతూ పెనుగులాడుకోవడం హనుమకొండ బస్టాండ్ లో ములుగు జిల్లా ప్రజలకు సర్వసాధారణం బస్సుల సంఖ్య కంటే ప్రయాణికుల సంఖ్య మూడు నుండి నాలుగు రెట్ల వరకు అధికంగా ఉండడంతో ప్రాంగణ ప్రయాణికుల కష్టాలు చుక్కలు కనపడేవి ఈ నేపథ్యంలో ఏటూరునాగారం బస్ డిపో ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ కొనసాగుతుంది. గతంలో డిపో మంజూరైన పాలకుల నిర్లక్ష్యం కారణంగా భూపాలపల్లికి వెళ్లిందని విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రత్యేక చొరవతో ఏటూరు నాగారం బస్ డిపో మంజూరు అయింది ఈ మేరకు బుధవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణాశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయగా బుధవారం వారిద్దరిని మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శాలువాలతో సత్కరించి ములుగు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న ఏటూరునాగారం ఆర్టీసీ డిపో మంజూరు కావడం వల్ల స్థానికుల చిరకాల వాంఛ నెరవేరిందని తెలిపారు.

# తెలంగాణతో పాటు ఏపీలో స్వల్పభూప్రంకణలు

**– భయందోళనలో ఇండ్లు విడిచి బయటకు వచ్చిన ప్రజలు**



ములుగు, తెలంగాణ సేన న్యూస్ : తెలుగు రాష్ట్రాల్లో నేటి ఉదయం భూకంపం ప్రకంపనలు సృష్టించింది. విజయవాడలో పలు సెకన్లపాటు భూమి కంపించింది. భయంతో ప్రజలు ఇళ్ల నుంచి పరుగులు తీశారు. ఏటూరునాగారం పరిసర గ్రామాల్లో సైతం భూమి ప్రకంపనలు సృష్టించింది. మరోవైపు తెలంగాణ జిల్లాలోని ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా భూకంపం వచ్చింది. కొన్ని జిల్లాల్లో నిమిషం పాటు స్వల్పంగా భూమి కంపించింది. వరంగల్ నగరంతోపాటు పలు ప్రాంతాల్లో భూకంపం రావడంతో ప్రజలు భయాం దోళనలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థం కాక ప్రజల భయంతో గందరగోళానికి గురయ్యారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్ల నుంచి కొంతమంది బయటకు వచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మూడు సెకన్ల ఇండ్లు అటు ఇటు ఉగడం కనిపించింది. బుధవారం ఉదయం 7:27 గంటలకు ఒక్కసారిగా భూకంపం రావడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. అలాగే మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఐదు సెకన్లపాటు భూమి ఆదరడం కంపించిందని ప్రజలు చెప్పుతున్నారు. మహబూబాబాద్ జిల్లా, కరీంనగర్ జిల్లా, విద్యా నగర్ లో భూమి తీవ్రంగా కంపించింది. భూకంపం దెబ్బకు కుర్చీలో కూర్చున ప్రజలు కుర్చీ కదలగానే భయపడి పోయారు. నిలబడిన వారు సైతం ఒక్కసారిగా పక్కకు ఒరిగినట్టు స్థానికులు చెబుతున్నారు.

# హిందువుల పై దాడికి నిరసనగా ర్యాలీ




నర్సంపేట,తెలంగాణ సేన : నర్సంపేట పట్టణంలో బాంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్నటువంటి దాడులకు నిరసనగా అలాగే ఇస్కాన్ స్వామి చిన్మయ దాస్ ప్రభువును వేంటనే విడుదల చేయాలనీ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లొ అధ్యక్షులు మోతె సమ్మిరెడ్డి గారు ఉపాధ్యక్షులు అంద్రు వనజ వి హెచ్ వి కార్యదర్శి వేల్పుల శ్రీధర్ గారు మాట్లాడుతూ బాంగ్లాదేశ్ లొ హిందువులపై జరుగుతున్నటువంటి దాడులపై మరియు స్వామీజీ ల అరెస్ట్ లపై యావత్ ప్రపంచ దేశాలు స్పంధించలి అక్కడ బలవంతంగా ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్న హిందువులను హిందువులను భయపెట్టి దాడులు చేస్తు రాజీనామా చేపిస్తు దేవాలయాలపై దాడులు చేస్తూ అక్కడి హిందువుల మాన ప్రాణాలు తీస్తున్నారు తక్షణమే యూ ఎన్ ఓ కూడా స్పందించి బాంగ్లాదేశ్ లొ మైనారిటీ గా వున్న హిందువుల హక్కులను కాపాడాలని కోరుతూ ప్రపంచ హిందువులు ఏకం కావాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమం లొ వివిధ హిందూ సంఘాల నాయకులు హిందూ బంధువులు పాల్గొనడం జరిగింది

# స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తీగల నాగరాజు



స్టేషన్ ఘనపూర్,తెలంగాణ సేన న్యూస్: జఫర్గడ్ మండలం సాగరం గ్రామానికి చెందిన తీగల నాగరాజు ఇటీవల తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేయగా బుధవారం న వెలువడిన ఫలితాల్లో ఓబీసీ కేటగిరిలో స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తీగల నాగరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తీగల నాగరాజు మాట్లాడుతూ తన ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని అన్నారు.

# ఫుడ్ పాయిజన్ ఘటన పై చర్యలు చేపట్టాలి

**– పి డి ఎస్ ఎఫ్**







సూర్యాపేట, తెలంగాణ సేన న్యూస్ : గురుకులాలు,సంక్షేమ హాస్టళ్ళు, ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని,అక్టోబర్ 31 వ తేదిన పెంచిన మెస్ చార్జీలను పూర్తిస్థాయిలో అమలుచేస్తూ నాణ్యమైన భోజనం,మంచినీరు అందించాలని, హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలని,అద్దె భవనాలలో కొనసాగుతున్న వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పిడిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపిన అనంతరం అదనపు కలెక్టర్ పి రాంబాబు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

# చింత చెట్టుకు కల్లు..చూసేందుకు ఎగబడుతున్న జనం



కొన్ని ఘటనలు చూస్తే నిజంగానే ఆశ్చర్యం కలగకమానదు. ఇప్పటి వరకు పలు చెట్ల నుంచి నీరు వచ్చిన దృశ్యాలు చూశాం.. తాజాగా బుధవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో విచిత్ర ఘటన చోటు చేసుకుంది. తాటి, ఈత, వేప చెట్లకు కల్లు రావడం మన అందరికీ తెలిసిన విషయమే.. కానీ వీటన్నింటికి భిన్నంగా ఆ గ్రామంలోని ఓ చింత చెట్టుకు కల్లు పారుతున్నది. ఈ వార్త సంచలనంగా మారింది. విషయం తెలుసుకున్న జనం విచిత్ర ఘటనను చూసేందుకు తరలి వస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కొత్తగూడ మండల కేంద్రంలోని వెలుబెల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని పోచమ్మ గుడి దగ్గర ఉన్న చింత చెట్టుకు కల్లు ఏరులై పడుతుండడంతో ఆశ్చర్యంతో తండోపతండాలుగా విచిత్రంగా చూస్తూ ఇది బ్రహ్మం గారి మహిమ అని బ్రహ్మం గారు చెప్పినట్టు జరుగుతుందని చర్చించుకుంటూ చింత కల్లు రుచి చూస్తూ అబ్బా అంటూ లొట్టలు వేస్తున్నారు గ్రామస్తులు.

# కొత్తగూడ లో బేబీ బచావో బేబి పడావో అవగాహన సదస్సు






కొత్తగూడ తెలంగాణ సేన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని జిల్లా మహిళా సాధికారత కేంద్రం" ఆధ్వర్యంలో "బేటి బచావో" "బేటి పడావో''అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ మాట్లాడుతూ అమ్మాయిని రక్షించండి అమ్మాయిని చదివించండి బాలికలు వాళ్ళకి ఉన్న హక్కులను సద్వియోగము చేసుకోవాలని నేడు అమ్మాయిలకు, మహిళలకు రోజు రోజుకు వారిపై లైంగిక వేదింపులకు, హింసకు గురి అవుతున్నారని వారికి రక్షణ కరువైందని అమ్మాయిలు వారికి వారు సమస్యలను పరిష్కరించే విధముగా తల్లి తండ్రులు, సమాజం వారిని గుర్తించే విధముగా మలచుకోవాలని తల్లి తండ్రులు ఆడపిల్ల అంటె గర్వముగా చెప్పుకునే విధముగా పేరు తీసుకురావాలని తెలియచేయదము జరిగింది బాల్య వివాహాలు గురించి, మరియు హెల్ప్ లైన్ నంబర్స్ 1098,181,100, 1930 గురించి చెప్పడము అయినది. ఈ కార్యక్రమం లో తాత్కాలిక ప్రిన్సిపల్ లలిత గారు, పాఠశాల యాజమాన్యం, విధ్యార్థులు మహిళా సాధికారత కేంద్రం స్టాఫ్ సౌజన్య, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

# 21వ రోజు మహా అన్న ప్రసాదం



నర్సంపేట, తెలంగాణ సేన న్యూస్ : నర్సంపేటలో బుధవారంన శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మధవశంకర్ ఆదేశాల మేరకు ఆలయ అధ్యక్షులు కమిటీ బృందం చేతుల మీదుగా నూతన వస్త్రాలు ఈరోజు అన్నదాతలుగా ఉన్న సుంకరి సుప్రియ సంతోష్ రెడ్డి మామిడి పద్మ సదానందం, దేశ రాధిక సంపత్ దంపతుల కుమారుడు రుద్రంస్, కొప్పు సుమతి సుధాకర్ తాళ్లపల్లి బండారి వెన్నెల ఆరుషి కూతురు అల్లుడు అజయ్ కుమార్ కవిత, ఆలేటి దైవిక్ దంపతుల కుమారుడు కోడలు ప్రమోద్ రెడ్డి అలేఖ్య లు ధరించి స్వామివారి పూజలో పాల్గొని శిరస్సుపై నైవేద్యాన్ని స్వీకరించి మాలదార స్వాములకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారు ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా, సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా మాదారపు చంద్రశేఖరం శ్రీరాం ఈశ్వరయ్య భూపతి లక్ష్మీనారాయణ పిన్నా రామనాథం శింగిరికొండ వేణుగోపాల్ ఆకుల ప్రభాకర్ బండారుపల్లి చేంచరావు భరత్ రఘు ఆలయ అర్చకులు గురుస్వాములు గుమస్తా దేశి రాము శ్రీధర్ మర్రి రాజు దాతల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు

# ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలి

**– కే రాజన్న, జిల్లా కార్యదర్శి**

**– సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ప్రజా పంథా**

నిర్మల్, తెలంగాణ సేన న్యూస్ : ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను వెంటనే ఏర్పాటు చేయాలని, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ప్రజా పంథా. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, నిర్మల్ జిల్లా కేంద్రంలో గల బస్సు డిపో ముందు ధర్నా చేసి డిఎం కి వినతిపత్రమును అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నిర్మల్ జిల్లా కార్యదర్శి కె రాజన్న, ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, నిర్మల్ బస్ డిపో ముందు బుధవారం రోజునధర్నా చేసి, డిఎం గారికి వినతి పత్రము ఇవ్వడం అయినది.

ఈ సందర్భంగా, మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు ఎక్కువ ప్రయాణాలు రాకపోకలు కొనసాగిస్తున్నారని ,దీనివల్ల ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో, బస్సులు కొరత ఏర్పడడంతో ఉన్నబస్సుల్లో కిక్కిరిసిపోయిన జనంతో తల్లడిల్లి, ఊపిరి ఆడక సొమ్మసిల్లి పోతున్నారని, వృద్ధులు , వికాలాంగులు, చంటిపిల్ల తల్లులు ,పురుషులు బస్సుల్లో ఎక్కువ రద్దీ ఉండడంతో సీట్లు దొరకక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని,కొన్ని సందర్భంలో సీట్ల కోసం కొట్టుకునే పరిస్థితి ఉందని చివరికి ఆర్టీసీ ఉద్యోగులపై కూడా అసభ్యకరమైన మాటలు, దాడులు కూడా జరుగుతున్నాయని దీనిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని అన్నారు. మహాలక్ష్మి పథకం కు ముందు రోజుకు సగటున 45 లక్షల ప్రయాణికులు ప్రయాణం చేస్తే ఇప్పుడు సగటున 55 లక్షల మంది ప్రయాణాలు కొనసాగిస్తున్నారని వీటికి సరిపడా బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బస్సులు కూడా ఆపడం లేదని అన్నారు. బస్సులు లేకపోవడంతో ఉన్న బస్సులో ప్రయాణీకులు,170 మంది ఏకడంతో బస్సు టైర్ సైతం ఉడిపోయాయని ప్రమాదలు జరుగుతున్నాయని నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది.

రాష్ట్రంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను ఏర్పాటు చేయాలని బస్సులతో పాటు కొత్త ఉద్యోగాలు కూడా కల్పించాలని ఆర్టీసీ ఉద్యోగుల మీద పని భారం, పడుతుంది .ఎక్కువ ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఉన్న బస్సుల్లో కూడా కెపాసిటీ, పరిమితికి మించి ప్రయాణాలు కొనసాగిస్తున్నారని ఊపిరాడని పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. వెంటనే కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికులను




ఆదుకోవాలని ఆర్టీసీలో కొత్త ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ లక్ష్మి. జిల్లా నాయకులు ఎస్ లక్ష్మి.సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఎం బక్కన్న, ఎస్ గంగన్న, జిల్లా కమిటీ నాయకులు కమల. విజయ.నర్సయ్య. కవిత.దుర్గ.గంగామణి, లక్ష్మి కవిత, విజయ ,వసంత, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన వ్యాపారాలు.. గాలిలో ప్రాణాలు

ఉమ్మడి జిల్లా నెట్‌వర్క్, డిసెంబరు 4 ఉమ్మడి జిల్లాలోని రైతులు, చిరు వ్యాపారుల బతుకులు డేంజర్‌గా మారాయి. రోడ్డు పక్కన విక్రయాలు జరుపుకునే వీరిపైకి ఏ క్షణంలో ఏ వాహనం దూసుకు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు రోజుల క్రితం చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద రోడ్డు పక్కన కూరగాయలు అమ్మే రైతులపై నుంచి ఓ లారీ దూసుకెళ్లి బీభత్సం సృష్టించిన ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా, మరో నలుగురు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునేవారు భయం గుప్పిట్లో బతుకు వెళ్లదీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు, చిరు వ్యాపారులు కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకోవడానికి సరైన స్థలం లేక రోడ్ల పక్కన విక్రయాలు జరుపుతూ క్షణక్షణం భయపడుతున్నారు. ఇబ్రహీంపట్నంలో మార్కెట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మంచాల మండలం చిన్నారెడ్డిగూడ నుంచి నగరంలోని ఎన్టీఆర్ నగర్ మార్కెట్‌కు ఆటోలో కూరగాయలు తరిస్తుండగా ఐదేళ్ల క్రితం తెల్లవారుజామున ఓ కారు ఆటోను ఢీకొట్టడంతో డ్రైవర్‌తో సహా ఐదుగురు మహిళలు అక్కడిక్కడే దుర్మరణం చెందారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం రైతు బజార్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు నిర్మించినా వాటిని సద్వినియోగం చేసుకోక నిరుపయోగంగా మారుతున్నాయి. కూరగాయలను తరలింపునకు రవాణా ఖర్చులు భరించలేక రోడ్ల పక్కనే అమ్మకాలు చేస్తున్నారు. చేవెళ్ల వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో 2016 నవంబరు 19న చేవెళ్ల మండల కేంద్రంలో అప్పటి మంత్రులు పట్నం మహేందర్‌రెడ్డి, తన్నీరు హరీశరావు రైతు బజార్ నిర్మాణానికి రూ.50 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. రైతు బజారుతో పాటు పక్కనే షెట్టర్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు. చివరకు అంచనా వ్యయం రూ.95 లక్షలకు పెరిగింది. 2020 జూన్ 6వ తేదీన అప్పటి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితారెడ్డి రైతు బజార్‌ను ప్రారంభించారు. సుమారు నెల రోజుల పాటు రైతు బజార్ బాగానే కొనసాగింది. తర్వాత రైతులు, వ్యాపారులు రైతుబజార్‌కు వెళ్లడం మానేసి రోడ్డు పక్కన అమ్ముకోవడం ప్రారంభించారు. దీంతో రెండేళ్లుగా రైతు బజార్ నిరుపయోగంగా దర్శనమిస్తుంది. అలాగే కందుకూరు మండల కేంద్రంలో రూ.30 లక్షలతో కూరగాయల మార్కెట్‌ను నిర్మించినా ఉపయోగం లేకుండా పోయింది. శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామంలో రోడ్డు పక్కన సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు కూరగాయలు విక్రయిస్తున్నారు. యాచారం మండలం నందివనపర్తిలో కూరగాయల మార్కెట్ నిర్మాణం ప్రారంభించి ఆరేళ్లవుతున్నా పూర్తి కాలేదు. రూ.30 లక్షలతో నిర్మాణం చేపట్టారు. మరో రూ.20 లక్షలు కేటాయించి పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. కేశంపేట మండల కేంద్రంతో పాటు కొత్తపేట గ్రామంలో సంత రోజుల్లో రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. దీంతో సంత రోజున ట్రాఫిక్‌ను మళ్లించాల్సి వస్తుంది. కొందుర్గు, చౌదరిగూడలో కూడా రోడ్లపైనే విక్రయాలు జరుగుతున్నాయి. షాద్‌నగర్‌లో రైతు బజార్లు లేవు, కాలనీల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు కూరగాయలు విక్రయిస్తున్నారు. సమీకృత మార్కెట్ నిర్మాణం జరుగుతుంది. మేడ్చల్ పట్టణంలో వ్యాపారస్తుల కోసం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కీసరలో రోడ్డుపై ప్రధాన చౌరస్తాలో చిరు వ్యాపారులు పూలు, పండ్లు షాపులు తాత్కాలికంగా వేసుకుని విక్రయాలు జరుపుతున్నారు. ఇబ్రహీంపట్నంలో రోడ్డుపై ఉన్న కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు, తోపుడు బండ్లపై పూల విక్రయాలు జరుగుతున్నాయి. అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాయలం రోడ్డు వరకు, చౌరస్తా నుంచి మంచాల వెళ్లే రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు జరుపుతున్నారు. దాంతో కొనుగోలుదారులు కూడా వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని రైతు బజారు రోడ్డు శని, ఆదివారాల్లో కిక్కిరిసిపోతుంది. బైక్‌ల సంగతి పక్కన పెడితే కాలినడకన వెళ్లడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. రోడ్లపైనే వ్యాపారం కొనసాగిస్తున్నా.. వాహనాలను పార్కింగ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇబ్రహీంపట్నంలో కూరగాయలతో పాటు మాంసం దుకాణాలు, పూలు, పండ్ల విక్రయాలు రోడ్డుపైనే కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఏళ్ల తరబడిగా ఈ తంతు కొనసాగుతున్నా.. అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడంలేదు. ప్రతీ బుధవారం జరిగే సంతతో స్థానిక అంబేద్కర్ చౌరస్తా మొదలు తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుకిరువైపులా వస్తు సామగ్రి, కూరగాయల వ్యాపారంతో మరీ ఇబ్బందిగా మారింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద రెండేళ్ల క్రితం రూ.1.06 కోట్ల వ్యయంతో 36 మడిగెలతో కూరగాయల కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినా నేటికీ అందుబాటులోకి రాలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించలేదు. పక్కనే రూ. 4.50 కోట్ల నిధులతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. నిధులు విడుదల చేయకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. అలాగే ఆమనగల్లులో రూ.4.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. రోడ్లపైనే కూరగాయలు, చేపల విక్రయాలు జరుగుతున్నాయి. వికారాబాద్ జిల్లా పరిగిలో కూరగాయల మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. దీంతో నడి రోడ్డుపై కూరగాయ విక్రయాలు జరుపుతున్నారు.

# కాంగ్రెస్‌కు జనబలం ఎప్పుడు లభించేను?

ఎన్ని గట్టి ప్రయత్నాలు చేసినా, ఎంత విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లినా భారతీయ జనతా పార్టీ విస్తృతి, ఉధృతిని ఎందుకు అడ్డుకోలేకపోతున్నాం? గెలిచిన రాష్ట్రాల్లోనే బీజేపీ మరీ మరీ ఎందుకు గెలుస్తోంది? గతంలో కంటే ఎక్కువ ఓట్లు ఎలా సాధిస్తోంది? అసలు ఎక్కడ పొరపాటు జరుగుతోంది? సమీప భవిష్యత్తులో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోగలదా? అన్న ప్రశ్నలు గత వారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరి మనసుల్లో మెదిలాయి. ఎవరి ముఖాల్లోనూ చిరునవ్వు ఏ కోశానా కనపడలేదు. వారు సాధారణ నేతలు కాదు. ఎన్నో యుద్ధాల్లో ఆరితేరినవారు. ఎంతో అనుభవం ఉన్నవారు. అయినా ఎంతగా తలలు బాదుకున్నా తమ వరుస ఓటములకు కారణాలేమిటో వారు నిర్దిష్టంగా చెప్పలేకపోయారు. నాలుగున్నర గంటల పాటు జరిగిన చర్చలో ఎంతసేపూ బీజేపీ మతపరమైన ఎజెండాను, మోదీ ఉపన్యాసాలను, ఈవీఎంలను నిందించినవారే ఎక్కువగా ఉన్నారు. కేవలం ఈవీఎంల వల్లే మనం ఓడిపోయామా? వేరే కారణాలు లేవా? అన్న ప్రశ్నలపై వర్కింగ్ కమిటీ సమావేశంలో పెద్దగా చర్చించినట్లు లేదు. చివరకు మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై మరో కమిటీని వేయాలని నిర్ణయించి చేతులు దులుపుకున్నారు. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హరియాణా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అంతర్గత కమిటీలను నియమించింది. ఆ కమిటీలు ఏమి చెప్పాయో, వాటి ఆధారంగా ఏ నిర్ణయాలు తీసుకున్నారో ఎవరికీ తెలియదు. అయినా కమిటీల వల్ల ఏమి జరుగుతుంది? తెలుగుదేశం అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల హిందూస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో బీజేపీ విజయ రహస్యం గురించి వెల్లడించారు : 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పుడూ ఎన్నికలకు తయారీగా ఉంటారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కూడా ఆయన ఇప్పటికే సన్నాహాలు మొదలు పెట్టారు' అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించిన రోజే నరేంద్రమోదీ బీజేపీ పార్టీ కార్యాలయానికి వచ్చి వేలాది కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. మోదీ, మోదీ అన్న నినాదాలు మిన్నంటుతుండగా 'హమ్ ఏక్ హై తో సేఫ్ హై' (మనం ఒకటిగా ఉంటే సురక్షితంగా ఉంటాం) అని మోదీ మరోసారి ప్రకటించారు. మహారాష్ట్ర ప్రయోగాన్ని దేశమంతటా అమలు చేసేందుకు బీజేపీ ఇప్పటి నుంచే సిద్ధమవుతోంది. 'మనం కనీసం ఒక ఏడాది ముందైనా ఎన్నికలకు సంసిద్ధం కావాలని అర్థం అవుతోంది' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో అన్నారు. మోదీ ఒక ఎన్నికల ఫలితాలు రాకముందే మరో ఎన్నికలకు సిద్ధమయి ఉంటారని కాంగ్రెస్ నేతలు ఇంకా గ్రహించలేదన్న విషయం స్పష్టమవుతోంది. భారతీయ జనతా పార్టీ ఎజెండా, ప్రణాళికకు సంబంధించి ఎవరికీ పెద్ద అనుమానాల్లేవు. మతపరమైన భావోద్వేగాలు, దేశ భక్తిని రంగరిస్తూనే క్రింది స్థాయి నుంచి పార్టీని నిర్మించి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సమాయత్తమవుతూనే ఉంటుంది. ప్రత్యర్థి పార్టీలను బలహీనపరిచేందుకు వ్యూహాలను నిరంతరం అమలు చేస్తూనే ఉంటుంది. పార్టీకి చెందిన వివిధ అనుబంధ సంస్థలు, సంఘ్ పరివార్ సంస్థలు ఎప్పుడూ సమావేశాలను, సదస్సులను నిర్వహిస్తూ ప్రజలను తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంటాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ, సంఘ్ పరివార్ సంస్థలు విస్తృతంగా పనిచేస్తుంటాయి. పోలింగ్ బూత్ స్థాయి నుంచి సూక్ష్మ వ్యూహాలు సిద్ధం చేస్తాయి. వీటన్నిటికి తోడు దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధి జరుగుతోందని, ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రరాజ్యంగా మారడం ఖాయమని వివిధ స్థాయిల్లో ఢంకా బజాయిస్తూనే ఉంటారు. వికసిత్ భారత్, స్వచ్ఛ భారత్ వంటి నినాదాలు మారుమ్రోగుతూనే ఉంటాయి. సరే, ఆ పార్టీకి నిధుల కొరత ఏ మాత్రం ఉండదు కదా. గెలిచిన రాష్ట్రాల్లో మళ్లీ గెలిచేందుకు, ప్రతిపక్షంగా మారిన రాష్ట్రంలో మళ్లీ అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ కసిగా పనిచేస్తుంది. ఓడినా, గెలిచినా తమ ఓటు శాతం తగ్గకుండా చూసుకుంటుంది. అదే కాంగ్రెస్ వరుసగా ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయి కాని వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన సందర్భాలు ఇటీవలి కాలంలో లేవు. 2014లో కాంగ్రెస్ హరియాణలో గెలిచినప్పటికీ 2019 నుంచి ఓడిపోతూనే వస్తోంది. పంజాబ్‌లో అయిదేళ్లు పాలించి ఆప్‌కు అధికారాన్ని అప్పగించింది. అదే బీజేపీ గుజరాత్, హరియాణాలో వరుసగా మూడుసార్లు గెలిస్తే, అస్సాం, త్రిపుర, గోవా, మణిపూర్, యూపీ, ఉత్తరాఖండ్, మేఘాలయ, నాగాలాండ్, సిక్కింలలో వరుసగా రెండుసార్లు గెలిచింది. అంటే కనీసం డజన్ రాష్ట్రాల్లో బీజేపీ మిత్రపక్షాలు ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తున్నాయన్నమాట. కాంగ్రెస్‌తో పోలిస్తే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, జేఎంఎం వంటి ప్రాంతీయ పార్టీలు వరుస విజయాలు సాధించాయి. తెలుగుదేశం ఒకసారి ఓడినా మరోసారి వీరోచితంగా పోరాడి అధికారంలోకి రాగలిగింది. కాంగ్రెస్‌లో ఆ కసి ఎందుకు కనపడడం లేదు? అసలు దేశ అభివృద్ధి నమూనా విషయంలో కాంగ్రెస్ విధానాలకూ, బీజేపీ విధానాలకూ తేడా ఏమైనా ఉన్నదా? 'అదానీ, కులగణన, రాజ్యాంగాన్ని కాలరాయడం ప్రజా సమస్యలు కావా? వాటికి అనుకూలంగా ప్రజలు ఎందుకు స్పందించడం లేదు?' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ప్రశ్నించినట్లు తెలిసింది. అదానీని విమర్శించినంత మాత్రాన కాంగ్రెస్ కార్పొరేటీకరణను వ్యతిరేకిస్తుందని ఎవరైనా అనుకుంటారా? అదానీపై మిత్రపక్షాలలో కూడా ఏకాభిప్రాయం లేదు. కులగణన గురించి ప్రస్తావించినంత మాత్రాన సామాజిక న్యాయం కోసమే కాంగ్రెస్ జన్మించిందని జనం అనుకునే అవకాశాలున్నాయా? ఏ విషయంలో కాంగ్రెస్ తాను బీజేపీ కంటే భిన్నమైన సైద్ధాంతిక సంస్థ అని నిరూపించుకోగలదు? కాంగ్రెస్ పార్టీ రకరకాల సిద్ధాంతాలు ఉన్న పంచకూళ కషాయంలా ఉంటుంది. బీజేపీ దశాబ్దాలుగా ఒకే సిద్ధాంతం ఆధారంగా పనిచేస్తే కాంగ్రెస్ ఒక నిర్దిష్ట సిద్ధాంతాన్ని దీర్ఘకాలం కొనసాగించలేకపోతోంది. మహావికాస్ అగాధీకి మహారాష్ట్రలో కేవలం ముస్లిం ఓట్లే అధికంగా వచ్చాయని, మహాయుతికి ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ఓట్లు పెరిగాయని గణాంక వివరాలు చెబుతున్నాయి. మహిళలు, యువకులు మహాయుతివైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. అలా ఎందుకు జరిగింది? 2024 ఎన్నికలకు రెండేళ్ల ముందు పార్టీ ముందున్న సవాళ్లను నిర్ణయించి వాటిని అధిగమించేందుకు కురువృద్ధులైన నేతలతో సోనియా ఒక సాధికార బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ఏమి చెప్పిందో, చెప్పిన వాటిని అమలు చేశారో, లేదో తెలియదు కాని ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో అనుకున్నంత మేరకు ఫలితాలను సాధించలేకపోయారు. సమకాలీన అంశాలపై చర్చించి పార్టీ దృక్పథాన్ని రూపొందించేందుకు నియమితులయిన సభ్యులు కూడా పార్టీకి నిర్దిష్టమైన సైద్ధాంతిక స్వరూపాన్ని రూపొందించలేకపోయారు. సంస్థాగతంగా చేయాల్సిన పెను మార్పులను సూచించేందుకు గతంలో ఆంటోనీ, అహ్మద్ పటేల్ లాంటి వారితో కమిటీలు వేసినా వారి సూచనలు అమలు అయిన దాఖలాలు లేవు. ఏ పెను మార్పులూ జరగలేదు. నిరంతర ఉద్యమాలు చేసే విషయంపై నిర్ణయించేందుకు, పార్టీని ఆధునికీకరించేందుకు ఏర్పర్చిన కమిటీలు ఏం చెప్పాయో కూడా ఎవరికీ తెలియదు. బహుశా ఈ కమిటీ నివేదికలు ఏఐసీసీ లైబ్రరీలో దుమ్ము కొట్టుకుపోతూ ఉంటాయి! ఇక 'కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి' అని ఖర్గే అన్నప్పటికీ ఆ నిర్ణయాలు ఎప్పుడు తీసుకుంటారో చెప్పలేము. ముఠాతత్వం, కుమ్ములాటలు కూడా ఒక కారణమని చెప్పిన ఖర్గే పార్టీ అధ్యక్ష స్థానంలో ఉండి వాటిని ఎందుకు అరికట్టలేకపోతున్నారో ఎవరు చెప్పగలరు? 'ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలే అన్ని నిర్ణయాలు తీసుకున్నాయి' అని ఖర్గే సమావేశంలో వాపోవడం గమనార్హం. కాంగ్రెస్‌లో యథాతథ పరిస్థితిని ఆకాంక్షించేవారే ఎక్కువ ఉండడం, సమూలంగా మార్పులు చేసేందుకు పార్టీ అగ్రనేతలు సాహసించకపోవడం వల్ల ఆ పార్టీ బీజేపీని ఢీకొనగల నవనవోన్మేషమైన శక్తిగా ఆవిర్భవించగలదన్న నమ్మకాలు కలగడం లేదు. అందుకు ప్రధాన కారణం వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న పార్టీలో తుక్కూ, తుప్పూ బాగా పేరుకుపోయి ఉండడం. కార్పొరేటర్ స్థానాన్ని కూడా గెలవలేని ఏడు పదులు దాటిన సీనియర్ నేతలు తమ గుర్తింపు కోసం తరుచూ విలేఖరుల సమావేశాలు నిర్వహించడం, ఎవరూ పట్టించుకోకపోయినా తమ అమూల్యమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం కాంగ్రెస్‌లోనే ఎక్కువ కనపడుతుంది. రాహుల్ గాంధీతో పాటు కొందరు నేతలు జనంలోకి వెళుతూ, ప్రజా సమస్యలపై మాట్లాడుతూ, కార్మికులు, యువతతో సంభాషిస్తూ కనపడుతున్నారు.

కానీ ఎంతో కష్టపడి కాంగ్రెస్ తమకు అనుకూల వాతావరణాన్ని సృష్టించుకున్నా ఆ వాతావరణం ఓట్లుగా మారేందుకు తగిన పరిస్థితులను కల్పించుకోలేకపోతోంది. 'సానుకూల వాతావరణం ఉంటే చాలదు దాని వల్ల విజయాలు రావు. అను దినమూ ఇరవై నాలుగు గంటలూ పనిచేయాలి' అని ఖర్గే వర్కింగ్ కమిటీ సమావేశంలో సరిగానే అన్నారు. అంతే కాదు, ఎన్నికలు లేనప్పుడు కాంగ్రెస్ పార్టీ యంత్రాంగం చాలా స్తబ్దంగా ఉంటుంది. ఆ సమయాన్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకున్న దాఖలాలు లేవు. ఎన్నికలప్పుడే కాంగ్రెస్ నేతలు జనంలో కనపడతారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న విషయంలో కాంగ్రెస్ చూపే అధారాలను ప్రజలు విశ్వసించేలా చేయనంతవరకూ ఈవీఎంలపై ఎన్ని ఆరోపణలు చేసినా ఫలితం ఉండదు. పోలింగ్ బూత్ స్థాయి ఓటర్ల జాబితాపై దృష్టి సారించాలి అని ఖర్గే ఆలస్యంగానైనా గ్రహించారు. బీజేపీ సిద్ధాంతం మంచిదా కాదా అన్నది వేరే చర్చ. ఆ పార్టీ తన సొంత ఓటు బ్యాంకు నిర్మించుకుంటూ, పెంచుకుంటూ పోతోంది. కాంగ్రెస్ పూర్తిగా బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకుపై ఆధారపడుతోంది. తన ఓటు బ్యాంకును తానే స్వంతంగా నిర్మించుకోనంతవరకూ కాంగ్రెస్‌కు భవిష్యత్తు అగమ్యగోచరంగానే ఉంటుంది

## యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులుగా అజార్



సిద్దిపేట, తెలంగాణ సేన న్యూస్ : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు అజార్ ఇటీవల నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజార్ భారీ మెజార్టీతో గెలుపొందిన అజార్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడతాను అని అన్నారు.

## హామీలు అమలు లో కాంగ్రెస్ విఫలం తిరుపతి రెడ్డి



సిద్దిపేట, తెలంగాణ సేన న్యూస్ : కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల బిజెపి జనరల్ సెక్రటరీ మాచిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు బుధవారం మర్కుక్ మండల కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో మాచిరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గత 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనకు ఏడాది కాంగ్రెస్ పాలనకు ఏమాత్రం తేడా లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు విస్మరించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఈ సంబరాలు చేసుకుంటుందా అని విడ్డూరం వ్యక్తం చేశారు, ఇకనైనా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రజా పాలనపై దృష్టి పెట్టాలని అన్నారు

## గజ్వేల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా రాజశేఖర్ రెడ్డి



గజ్వేల్, తెలంగాణ సేన న్యూస్ : యూత్ కాంగ్రెస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు గా యేర్ల రాజశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారు ఇటీవల నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గజ్వేల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు ఈ సందర్భంగా బుధవారం గజ్వేల్ లో రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నా మీద నమ్మకంతో యూత్ కాంగ్రెస్ గజ్వేల్ మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడతాను అని అన్నారు

## విద్యా ప్రమాణాలు పెంచండి




కొత్తగూడ, తెలంగాణ సేన న్యూస్ : మండలంలోని కిష్టాపురం ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి గుమ్మడి లక్ష్మీనారాయణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం ప్రార్ధనా సమయం నుండి మధ్యాహ్నం భోజనం వరకు పరిశీలించారు. మొత్తం 23 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో వంద శాతం హాజరు కావడాన్ని ఉపాధ్యాయులను మెచ్చుకున్నారు. కృత్యధార బోధనను తిలకించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పిల్లల్లో ఆశించిన విద్యా ప్రమాణాలు పెంచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏమ్మీవోతో పాటు సీ ఆర్పీ అశోక్, ఉపాధ్యాయులు కొప్పుల రేణేశ్వర్, వజ్జ శ్రీరాములు పాల్గొన్నారు.

## ములుగు జిల్లాలోని ఏటూరు నాగారంకు ఆర్టీసీ డిపో మంజూరు

**- డిపో మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : మూడు రాష్ట్రాల సెంటర్ గా ఉన్న ఏటూరు నాగారం కి ఆర్టీసీ బస్సు డిపో మంజూరు కావటం పట్ల సీతక్క హర్షం ఏటూరు నాగారం నగరంలో బస్సు డిపో మంజూరు కావడంతో ఏజెన్సీ ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందన్న సీతక్క తెలిపారు. సచివాలయంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ధన్యవాదాలు తెలిపిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ములుగు డిసిసి అధ్యక్షులు పైడాకుల అశోక్.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మార్కెట్ కమిటీ ఏడీ

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బైల్ బజార్ వద్ద గల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. రూ.7వేలు లంచం తీసుకుంటుండగా మార్కెట్ కమిటీ వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాస్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. కొత్తలైసెన్స్ రెన్యువల్ గూర్చి పదివేల రూపాయలు లంచం డిమాండ్ చేయగా, ఏడువేల రూపాయలకు బేరం కుదుర్చుకున్నారని, ఇవాళ రూ.7వేలను కార్యాలయంలో ఏడీ శ్రీనివాస్ కు బాధితుడు వెంకట్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిర్మల్ జిల్లాలో ఏసీబీ అధికారుల వరుస దాడులతో అధికారుల గుండెల్లో దడ పుట్టిస్తుంది.

# ప్రగతి పథంలో నడిపించడమే ఎజెండా

ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపు 55,143 ఉద్యోగ నియామకాలు పూర్తిచేసిన నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా అశేష జనవాహిని మధ్యన పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తో పాటు మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ వేదికగా.. టీజీ పి ఎస్ సి ద్వారా గ్రూప్ %×ు% కేటగిరీ కింద కొత్తగా ఎంపికైన 8,084 మందికి, సింగరేణి సంస్థలో నియమితులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను లాంఛనంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించారు. పెద్దపల్లి జిల్లాలో దాదాపు 1035 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వర్చువల్ గా ప్రారంభించారు. స్కిల్ యూనివర్సిటీ తో కలిసి పని చేయడానికి సంబంధించి 7 ఏజెన్సీలతో ఇదే వేదికగా ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందాలు కుదిరాయి. అలాగే, అత్యంత కీలకమైన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ఏర్పాటును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే సీఎంస్ కప్ -2024 ట్రోఫీని ఆవిష్కరించారు. అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. గడిచిన పదేండ్లలో అభివృద్ధికి నోచుకోని ఎన్నో కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఉండగా, కోటి మందిని చేర్చి ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసేవరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమమే ఉద్యోగ ఉపాధి సాధన కోసం జరిగిన నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే శాఖల వారిగా మొత్తం 55,143 ఉద్యోగ నియామకాలు చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు నెలకొల్పిన విషయాన్ని వివరించారు. ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందాలని, బీసీలకు సరైన వాటా దక్కాలన్న ఉద్దేశంతోనే కులగణన చేపట్టినట్టు తెలిపారు. నిరుపేదల బిడ్డల చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఉద్దేశంతోనే పదేళ్లుగా పెంచని డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచామని గుర్తుచేశారు. కరీంనగర్ జిల్లా శాతవాహన యూనివర్సిటీకి ఒక ఇంజనీరింగ్, ఒక లా కాలేజీ మంజూరు చేస్తామని చెప్పారు. పెద్దపల్లిలో సాగునీటి ప్రాజెక్టు, రామగుండంలో విద్యుత్ ప్రాజెక్టు సాధించడం ప్రజా విజయంగా అభివర్ణించారు. కాళేశ్వరం నుంచి



చుక్కనీరు వినియోగించకుండా రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండించి చరిత్ర రికార్డు సాధించాం. ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నాం.గత ప్రభుత్వం చెల్లించని రైతు బంధు 7500 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశాం. తొలి సంవత్సరంలో 21 వేల కోట్లతో 25 లక్షల రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర సృష్టించాం. నిర్భందాల మధ్య సాగిన పదేండ్ల పాలన నుంచి స్వేచ్ఛ కల్పించామని పలు సందర్భాలు, సంఘటనలను ఉదహరించారు. ఒక్కరోజులో ఎవరూ అద్భుతాలు సృష్టించరని, ప్రజలు ఇచ్చిన అవకాశం మేరకు సంక్షేమం, అభివృద్ధి రెండింటిపైనా దృష్టి సారించి ముందుకు సాగుతున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దుద్దిళ్ల శ్రీధర్ బాబు , కోమటిరెడ్డి వెంకటరెడ్డి , పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఎంపీ గడ్డం వంశీ గారు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ , స్థానిక పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన గౌరవ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సింహాల్లా పోరాడుతున్న మా కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు

-మొదటిపేజీ తరువాయి

ఏదైతో ఉందో దాన్ని అనుసరించుకుని ఇవాళ జోసెఫ్ గోబెల్స్‌ను ఆదర్శంగా తీసుకుని ఈ సీఎం, మంత్రివర్గం ప్రయత్నం చేస్తోంది. ప్రజలు, మీడియా దృష్టికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల గురించి తెలియజేయాలని ఈ సమావేశం నిర్వహించాం అని కేటీఆర్ తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నిన్నటికి సంవత్సరం అయింది. బాక్సింగ్ క్రీడలో ఒక సామెత ఉంటది.. ఎంత గట్టిగా పంచ్ విసరగలిగామన్నది కాదు.. ఎంత గట్టిగా పంచ్‌ను విసిరినా తట్టుకుని తిరిగి నిలబడాలన్నది ముఖ్యం. ఇది క్రీడాకారుడికి పరీక్ష. ఆ విధంగా ఈ ఏడాది కాలంలో బీఆర్ఎస్ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంది. అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైన, కేసీఆర్‌కు గాయమైనా.. కవితను అరెస్టు చేసి ఐదున్నర నెలలు జైల్లో పెట్టినా, పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని ఓటమి పాలైనా.. మా పార్టీ జెండా మీద గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినా.. కేసులు పెట్టినా, అవమానాలకు గురి చేసినా తట్టుకుని నిలబడ్డాం. లగచర్లలో గిరిజన రైతుల పక్షానా నిలబడ్డాం. ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోరుబాట పట్టామని కేటీఆర్ గుర్తు చేశారు. ఈ రోజు తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్‌గా మారింది. హైడ్రా, మూసీ బాధితులతో పాటు పలువురు క్యూ కడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ బాధితులు తమ వేదనను చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఉండాలి.. తెలంగాణకు కేసీఆర్ శ్రీరామరక్ష అని వాలంటీర్లుగా పని చేస్తున్న వారికి, సోషల్ మీడియా సైనికులకు, ప్రతి రోజు కాంగ్రెస్‌తో తలపడుతున్న కార్యకర్తలకు, కేసులకు వెరవకుండా సింహాల్లా పోరాడుతున్న నాయకులకు ధన్యవాదాలు అని కేటీఆర్ తెలిపారు.

### తెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి

తెలంగాణ ఉద్యమ చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలి.. ఆ బాధ్యత మనందరిపై ఉన్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇందు కోసం తెలంగాణ ఉద్యమ చరిత్ర నేపథ్యంతో పుస్తకాలను తేవాలని, ఉన్న పుస్తకాలను సమీకరించాలని కేటీఆర్ ఆకాంక్షించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితీ సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రకు సంబంధించి పుస్తకాలు వేల సంఖ్యలో రావాలని సాహితీవేత్తలు కోరారు. ఆ బాధ్యత నేను స్వయంగా తీసుకుంటాను. తెలంగాణలో ఉన్న అజ్ఞాత సూర్యులను



వెలుగులోకి తీసుకువస్తాను. డీఎంకే మాజీ ఎమ్మెల్యే సీఆర్ శేఖర్.. ఇటీవలే నన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేద్కర్, గాంధీ జీవితానికి సంబంధించిన పుస్తకాలు నాకిచ్చి ఫొటో దిగారు. ఈ పుస్తకాలు ఎందుకు తీసుకొచ్చావని అడిగితే.. మేం మా పార్టీ ఐడియాలజీకి సంబంధించిన బుక్స్ బహుమతిగా ఇస్తాం. హైదరాబాద్‌కు రాగానే మీకు పుస్తకాలు ఇచ్చేందుకు హిమాలయ బుక్ డిపో వెళ్లాను. అక్కడ తెలంగాణ చరిత్ర పుస్తకాలు లేవు.. దొరికిన ఈ రెండు పుస్తకాలు ఇచ్చాను అనేసరికి కొద్దిగా మనసులో గాయమైనట్లు అనిపించింది. మనసు చివ్వుక్కుమంది. కాబట్టి తెలంగాణ ఉద్యమ చరిత్ర పుస్తకాలు చాలా రావాల్సిన అవసరం ఉంది. చాలా మంది పుస్తకాలు రాశారు. ఇవాళ పరిమితమైన స్థాయిలో ఇక్కడ పుస్తక ప్రదర్శన నిర్వహించాం.వచ్చే ఏడాది బ్రహ్మాండంగా చేసుకుందాం. వేల పుస్తకాలు సమీకరిద్దాం. ఈ సాహితీ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి రెండు కమిటీలు ఏర్పాటు చేస్తామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి మూడు పార్శ్వాలు ఉన్నాయని ప్రొఫెసర్ జయశంకర్ చెబుతుండేవారు. ఒకటి భావజాల వ్యాప్తి.. అంటే ప్రజలకు మోసం జరిగినప్పుడు, ప్రభుత్వాలు ప్రజలను విస్మరించినప్పుడు ఎప్పటికప్పుడు చర్చ జరగాలి. రెండోది ఆందోళన పథం.. సందర్భం వచ్చినప్పుడు ఆందోళన జరగాలి. లగచర్ల, అదానీ విషయంలో సందర్భానుసారంగా ఆందోళన నిర్వహించాం. ఆందోళన పథంలో వెనుకాడొద్దు. మూడోది ప్రజాస్వామ్య ప్రక్రియ.. ప్రజాస్వామికంగానే మన హక్కులను, డిమాండ్లను నెరవేర్చుకోవాలి. ఈ మూడింటిలో కవులు, కళాకారులు, సాహితీవేత్తల పాత్ర చాలా ముఖ్యం. కాబట్టి తెలంగాణ చరిత్రను భవిష్యత్ తరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కేటీఆర్ తెలిపారు.

### అప్పుల లెక్కలు కాదు.. హామీల లెక్కలు చెప్పు

అప్పుల లెక్కలు కాదు.. హామీల లెక్కలు చెప్పు.. వడ్డీల ముచ్చట్లు కాదు.. వాగ్దానాల ముచ్చట్లు చెప్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పులపై కారుకూతలు కాదు.. దమ్ముంటే నీ అసమర్థ పాలనపై శ్వేతపత్రం విడుదల చేయ్ అని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణలో ఏడాది పాలనలో రేవంత్ రెడ్డి లక్ష కోట్ల అప్పులు కొత్తగా చేశారు. రాష్ట్రం అధోగతి పాలైంది.. ప్రజలు తిప్పలపాలయ్యారు. రేవంత్ బ్రదర్సేమో కోట్లకు పడగలెత్తారు. రేవంత్ పాలన అంటే గుర్తుకొచ్చేది లక్ష కోట్ల అప్పులు, దారుణ ఘాతుకాలు, తప్పులు. ఈ ఏడాదిలో ఏం సాధించావు అంటే సమాధానం లేదు. ఆర్భాటం ,హడావుడి చేస్తున్నారు. ముఖ్యమంత్రి తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మళ్లీ అప్పులు అంటూ తప్పుడు కూతలు కూస్తున్నాడు. అప్పుల మీద కాదు.. నీ తప్పుల మీద చర్చ జరగాలి. ఇవాళ సూటిగా అడుగుతున్నాం దమ్ముంటే సమాధానం చెప్పు. సీఎం పదవి చేపట్టిన తర్వాత ఆ పదవి స్థాయి దిగజార్చావు. నీ ప్రభుత్వంలో మీ బ్రదర్స్ బాగుపడ్డారు. వారికి లాభం జరిగింది. రాష్ట్రానికి వెయ్యి కోట్ల పెట్టుబడులు ఇచ్చే స్థాయికి అనుముల బ్రదర్స్ ఎదిగారని ప్రజలు అనుకుంటున్నారు. వచ్చే ఏడాది ఫోర్బ్స్ జాబితాలో రిచెస్ట్ బ్రదర్స్ ఎవరంటే అనుముల బ్రదర్స్ అని వస్తదమో.. అదానీని కూడా దాటేస్తారేమో అని ప్రజలు అనుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. నీ ఏలుబడిలో రాష్ట్రానికి రాబడి తెచ్చే తెలివి లేదు. సంపద పెంచే సోయి లేదు. పాజిటివ్ పని చేసిన ముఖం లేదు. తెల్లారి లేస్తే కాకి కూతలు.. కేసీఆర్ మీద తిట్టు.. దేవుళ్ల మీద ఒట్లు.. ఇచ్చిన హామీలకు తూట్లు పొడిచావు. రాష్ట్ర ప్రతిష్ట పెంచాల్సింది పోయి.. దివ్యంగా ఉన్న రాష్ట్రం దివాళా తీసిందని ఆరోపణలు చేసిన దివాళాకోరు సీఎంవి నీవు. కొత్త పరిశ్రమలు కాదు.. ఉన్న పరిశ్రమలు తరలిపోతున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు తీరని అన్యాయం చేస్తున్నారు. ఇవాళ కొత్త స్లోగన్ పెట్టుకున్నాడు.. తెలంగాణ రైజింగ్ అని అంటున్నడు. అనుముల బ్రదర్స్ రైజింగ్ అని పెట్టుకోవాలి. తెలంగాణ మాత్రం ఫాలింగ్ అని చెప్పాలి. పన్నెండు పాలన మొత్తం అసత్యాలు, అటెన్షన్ డైవర్షన్ స్కీంలు తప్ప ఏం పీకారు. అబద్దాల కోరుగా తయారై మీడియా మేనేజ్‌మెంట్ చేస్తున్నావ్. ఆరు గ్యారెంటీల మీద చర్చ జరగొద్దని.. అప్పులు అంటూ కారుకూతలు కూస్తున్నావంటూ రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

# శీతాకాలంలో వేడివేడిగా సమావేశాలు



-మొదటిపేజీ తరువాయి

చర్చకు పెట్టబోతుందట. ఏడాది కాలంలో రైతాంగానికి 58 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చినట్లు సభా వేదికగా వివరిస్తారట. 52 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని కూడా చెప్పుకోవాలనుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. వీటితో పాటు విద్య, వైద్యం అన్ని శాఖల్లో జరిగిన అభివృద్ధిపై వివరిస్తారట. అంతేకాదు బీఆర్ఎస్ హయాంలో జరిగిన అప్పులు..వాటి వడ్డీలు ఇలా అన్ని లెక్కలు అసెంబ్లీ వేదికగా ప్రజల ముందు పెడుతామంటున్నారు హస్తం నేతలు.అయితే ఈసారి అసెంబ్లీ సమావేశాలను గత సెషన్ కంటే బెటర్‌గా యూజ్ చేసుకోవాలని భావిస్తోంది ప్రతిపక్షం బీఆర్ఎస్. ఇప్పటికే ప్రభుత్వ విధానాలపై నిత్యం పోరాడుతూ ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేస్తోంది గులాబీ పార్టీ. అసెంబ్లీ వేదికగా ఆరు గ్యారెంటీలపై గట్టి పట్టు పట్టాలని చూస్తుంది. రుణమాఫీలో లోపాలను వివరించడంతో పాటు ..ఇంకా ఎంతమందికి లోన్ మాఫీ కాలేదో లెక్కలతో సహా వివరించేందుకు రెడీ అవుతోందట.ఇక రైతుబంధుపై కూడా అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాలని భావిస్తోంది బీఆర్ఎస్. గురుకులాలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలను ప్రస్తావించనున్నారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీపై కూడా నిలదీస్తామంటున్నారు గులాబీ నేతలు. పారిశ్రామిక విధానం, మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.మరో ప్రతిపక్షం బీజేపీ కూడా అధికార పార్టీని నిలదీయాలని భావిస్తోంది. ఇప్పటికీ ఆరు గ్యారెంటీలకు సంబంధించి.. 66 అబద్ధాలు అంటూ ప్రచారం చేస్తుంది. కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జ్‌షీట్‌ను కూడా విడుదల చేసింది బీజేపీ. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు.. తలా కొన్ని సబ్జెక్టులను తీసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వ్యూహం రచిస్తోంది కమలదళం.అయితే ప్రతిపక్షాలు ఏయే అంశాలు లేవనెత్తే అవకాశం ఉందో ఇప్పటికే ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్లుగా సమాధానాలు, అవసరమైతే ఎదురుదాడికి కూడా వెనకాడొద్దని వ్యూహ రచన రెడీ చేస్తోందట. బీఆర్ఎస్ హయాంలో ఏ విధంగా శ్వేతపత్రాలు విడుదల చేశారో..అవసరమైతే ఈసారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలనే ఆలోచన కూడా చేస్తున్నారట కాంగ్రెస్ పెద్దలు.మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశారని..పదేళ్ల కాలంలో ఒక గ్రూప్-1ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని ఇలా వివిధ రంగాల్లో బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టాలని అనకుంటుందట కాంగ్రెస్ ప్రభుత్వం. పొలిటికల్‌గా కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేసి విమర్శలు ఎక్కుపెట్టాలని ప్లాన్ సిద్ధం చేస్తుందట. ఇలా ఎవరి వ్యూహాలు వాళ్లకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి అసెంబ్లీ సెషన్ హాట్ హాట్‌గా కొనసాగే అవకాశం ఉంది. అయితే శాసనసభ సమావేశాలకు ప్రధాని ప్రతిపక్ష నేత, గులాబీ బాస్ కేసీఆర్ హాజరవుతారా లేదా అన్నది మాత్రం సస్పెన్స్‌గానే కొనసాగుతోంది

# మోదం.. ఖేదం

**హైదరాబాద్ :** ఏడాది పరిపాలన పూర్తయిన తర్వాత ఎవరికైనా కూడా ఆత్మ పరిశీలన ఉంటుంది. సింహావలోకనం కూడా ఉంటుంది. మరి రేవంత్ రెడ్డికి తెలంగాణలో ఎలాంటి పరిస్థితి ఎదురవుతోంది? ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారా? హైకమాండ్ లక్ష్యాలను సాధించారా? ఎటువంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు? ఎటువంటి సమస్యలను కొని తెచ్చుకున్నారు?ముఖ్యమంత్రిగా ఏడాది కాలం పూర్తిచేసుకుని రెండవ ఏడాదిలోకి రేవంత్ ప్రవేశించారు. ప్రభుత్వ అధినేతగా తన మార్క్ చూపించడంతోపాటు.. మార్పును కూడా ప్రజలకు అనుభవంలోకి తెచ్చారు. తన బృందంతో కలిసి పనిచేస్తూ కొత్త కొత్త విజయాలను నమోదు చేశారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా.. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ.. రైతులకు రెండు లక్షల వరకు రుణ మాఫీ చేసి సరికొత్త ఘనత సృష్టించారు. అంతేకాదు తక్కువ సమయంలోనే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి రికార్డు సృష్టించారు. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటా కు 500 చొప్పున బోనస్ ఇస్తున్నారు. ఇక మూసి నదిని సుందరీకరించేందుకు అడుగులు పడుతున్నాయి. వచ్చే 50 సంవత్సరాల అవసరాలు తీర్చే విధంగా హైదరాబాదు నగరం అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణానికి రేవంత్ ముందడుగు వేస్తున్నారు.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నట్టు సీఎంవో కార్యాలయం ప్రకటించింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించింది.. 500 కు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తోంది. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే గృహాలకు ఉచితంగా కరెంట్ సప్లై చేస్తోంది. పంట పొలాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా అవుతుంది.. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తగ్గించడానికి 3000 వరకు ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. బాపూ ఘాట్ ప్రాంతంలో అతిపెద్ద గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర వాసులకు గోదావరి నుంచి తాగునీరు అందిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ కు కంటే మెరుగ్గా ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనున్నారు.కొంతకాలంగా నిర్లక్ష్యానికి గురైన రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను పెంచింది రేవంత్ ప్రభుత్వం.. మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు వేస్తున్నది. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రపంచ స్థాయిలోనే విద్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ధరణి పోర్టల్. ఎన్ఐసీ కి అప్పగించారు. మీడియాకు స్వేచ్ఛ కల్పించారు. మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపారు. పెట్టుబడులను కూడా భారీగా ఆకర్షిస్తున్నారు. ప్రాంతీయ బాహ్య వలయ రహదారి, రైలు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయడంతో తెలంగాణ దిశ మరింతగా మారనుంది. టైర్ -2 పట్టణాలలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు కానున్నాయి. వరంగల్ నగరాన్ని రెండవ రాజధానిగా తీర్చిదిద్దే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి వ్యక్తి పది లక్షల రూపాయల విలువైన ఉచిత వైద్యం అందించేందుకు ప్రణాళికలు పొందుతున్నాయి. ప్రతినెల ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు లభిస్తున్నాయి. తెలంగాణ తల్లి విగ్రహం సచివాలయం ఎదురుగా ఏర్పాటు కానుంది. ఇవన్నీ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సానుకూల అంశాలు.లగచర్ల, హైడ్రా, మూసీ నది వెంబటి నిర్మాణాలను పడగొట్టడం, ప్రభుత్వ వసతి గృహాల్లో నాసిరకమైన ఆహారం విద్యార్థులకు పెట్టడం, రుణమాఫీ కొంతమందికి కాకపోవడం వంటివి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారాయి. రైతు భరోసా కూడా ప్రభుత్వం ఖాతాలలో జమ చేయకపోవడం ఒకింత ఇబ్బందిగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడం లబ్ధిదారుల్లో అసహనాన్ని కలిగిస్తోంది. ఇవన్నీ కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రతిబంధకాలుగా నిలిచాయి. మరోవైపు భారత రాష్ట్ర సమితి కూడా వరుసగా విమర్శలు చేస్తోంది. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రభుత్వాన్ని ఎండగడుతోంది. మొత్తంగా చూస్తే తొలి ఏడాది రేవంత్ రెడ్డికి కేక్ వాక్ కాకపోయినప్పటికీ.. మరి తీసిపారేదగ్గ పరిపాలన మాత్రం కాదని విశ్లేషకులు అంటున్నారు. తొలి ఏడాది రేవంత్ రెడ్డి 100కు 75 మార్కులు తెచ్చుకున్నారని చెబుతున్నారు.. పరిపాలనలో మరింత నూతన ఒరవడి కొనసాగిస్తే పెద్దగా ఇబ్బంది ఉండదని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు.

# ములుగు ఎన్కౌంటర్ బూటకం

కానీ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్కౌంటర్ అంటే పట్టుకొని కాల్చి చంపడం అని అందరికీ తెలిసిందే.. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా 2015లో జరిగిన మేడారం లో శృతి,సాగర్ ఎన్కౌంటర్ వాళ్లపై జరిగిన హింసను చూస్తే అవి ఎన్కౌంటర్ కాదు ప్రభుత్వ హత్యలు అని పూర్తిగా స్పష్టమైందని, అదేవిధంగా గ్రామాల్లోకి వచ్చిన ఈ ఉద్యమకారులకు ప్రభుత్వమే విషం పెట్టించింది స్పృహ తప్పిపోయిన తర్వాత తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసి ముఖాలను నుజ్జు చేసి, మహిళాశవమైతే చేయి కూడా కిరాతకంగా విరిచేసి హత్యలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది నిజమైన ఎన్ కౌంటర్ కాదు. అధికారంలోకి రాకముందు ఇదే రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమాలను చూసి ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం నక్సలైట్లను కోరుకుంటున్నారని ఈ ముఖ్యమంత్రి ప్రకటించి ఉన్నాడు కానీ అదే ముఖ్యమంత్రి మావోయిస్టు పార్టీని ఒక రాజకీయ పార్టీగా గుర్తించడంలో మావోయిస్టు ఉద్యమకారులను గుర్తించడంలో విఫలమయ్యాడని ఏద్దేవా చేశారు.ఇప్పటికే 16 మందిని ఎన్కౌంటర్ రూపంలో హత్య చేశాడని, ఇదే కాంగ్రెస్ పార్టీ 2004లో వై.యస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో శాంతి చర్చలు జరిపి ఆరు నెలల పాటు ఎన్కౌంటర్ హత్యలు లేకుండా శాంతి కాలం కొనసాగింది.ఆ చరిత్ర తెలిసిన రేవంత్ రెడ్డి కూడా కేంద్ర ప్రభుత్వం ఆదివాసి ఉద్యమాలపై అమలు చేస్తున్న ఆపరేషన్ కాగార్ లో భాగంగానే 300కు పైగా ఆదివాసులు ఉద్యమకారులు హత్యకు గురికాపడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆపరేషన్ కగార్ లో భాగంగా నే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తెలంగాణ సరిహద్దులో ఇప్పటికీ మూడు చోట్ల మిలటరీ క్యాంపు లను ఏర్పాటు చేశారు. ఇంకో నాలుగు చోట్ల ఏర్పాటు చేయడానికి అంతేగాక ఒకవైపు ఉద్యమాలనేవి మౌలిక సమస్యలకు పరిష్కారం వైపుగా ఉంటాయని చెబుతూనే అదే ఉద్యమకారులను ఎన్కౌంటర్ పేరుతో కిరాతకంగా హత్య చేస్తున్నారు. ఇది జలగం వెంగళరావు కాలం నుండి ఇప్పటివరకు అన్నావాయితీగా వస్తున్నది. 2009లో ఎన్కౌంటర్లపై వచ్చిన ఉమ్మడి హైకోర్టు ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన జడ్జిమెంట్ పక్కన పెట్టారు దీనితో ఈ ఎన్కౌంటర్ హత్యకాండ నిరంతరాయంగా సాగుతున్నది.ఇప్పటికైనా 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎన్కౌంటర్ తీర్పును కలయం చేయవలసిన అవసరం ఉన్నది ఇప్పటికే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 మంది ఉద్యమకారులను ఎన్కౌంటర్ పేరుతో కాల్చి చంపాడని, నవంబర్ ఐదు జరిగిన రఘునాధపాలెం ఎన్కౌంటర్ పై నిజనిర్ధారణ బృందానికి బయలుదేరిన వారిని అశ్వరావుపేటలో నిర్బంధించారని హారగోపాల్ మండిపడ్డారు.చరిత్రలో ఎప్పుడు కూడా నిజనిర్ధారణ బృందాన్ని అరెస్ట్ చేసిన దాఖలాలు లేవు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజాస్వామిక బద్ధంగా పరిపాలించాలని ఎన్కౌంటర్ లేని తెలంగాణను నిర్మించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం నారాయణ రావు, బి అంజమ్మ, ఎన్కౌంటర్లో చనిపోయిన మధు సహచరి మీనా, బల్ల రవీంద్రనాథ్, డి సురేష్ కుమార్, కడమంచి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌బిఐకి చేరని రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు

రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుని ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఇంకా రూ.6,839 కోట్ల విలువ చేసే పెద్ద నోట్లు తమ ఖజానకు చేరలేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తెలిపింది. 2023 మే 19న రూ.2000 నోట్ల చలామణిని ఆర్‌బిఐ నిలిపివేసిన విషయం తెలిసిందే.

నవంబర్ ముగింపు నాటికి 98.08 శాతం నోట్లు మాత్రమే ఆర్‌బిఐకి చేరాయి. ఇంకా రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు రావాల్సి ఉందని పేర్కొంది. గతేడాది అక్టోబర్ వరకు మాత్రమే ఈ నోట్లను బ్యాంక్‌లు స్వీకరించాయి. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్‌బిఐ కార్యాలయాల్లో మాత్రమే వీటిని



తీసుకుంటున్నారు. నల్లధనంకు అవకాశం కల్పిస్తున్నాయని 2016లో మోడీ సర్కార్ పెద్ద నోట్ల పేరుతో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. వాటి స్థానంలో మరింత పెద్ద నోటు రూ.2,000ను తీసుకొచ్చింది.

# దమ్ముకు జిఎస్‌టి పొగ..!

దేశంలో సిగరేట్లు, పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని మరింత తగ్గించడానికి వాటిపై భారీగా పన్నులు మోపాలని జిఎస్‌టి కౌన్సిల్ భావిస్తోంది. పన్నురేట్ల హేతుబద్దీకరణలో భాగంగా ప్రస్తుతం వీటిపై విధిస్తున్న జిఎస్‌టిని 28 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని బీహార్ డిప్యూటీ సిఎం సామ్రాట్ చౌదరీ అధ్యక్షతన సమావేశమైన మంత్రుల బృందం నిర్ణయం తీసుకుంది. దీనిపై డిసెంబర్ 21న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో జరగనున్న జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా దుస్తులపై పన్ను రేట్లను సవరించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. రూ.1500 వరకు రెడీమేడ్ దుస్తులపై 5 శాతం, రూ.1500– 10,000 మధ్య 18 శాతం, రూ.10,000 పైబడిన దుస్తులపై 28 శాతం జిఎస్‌టి విధించాలని భావించారు. కొత్తగా 148 ఉత్పత్తులపై పన్ను విధించాలని ప్రతిపాదించగా.. వీటిపై జిఎస్‌టి కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం జిఎస్‌టి పన్నుల్లో నాలుగు శ్లాబులు ఉండగా.. కొత్తగా 35 శాతం రేటును కూడా చేర్చాలని జిఒఎం సూచించింది. కొత్త శ్లాబులో పొగాకు, సంబంధిత ఉత్పత్తులతోపాటు శీతలపానియాలు చేర్చాలని పేర్కొంది.



ప్రస్తుతం 5, 12, 18,28 శాతం రేట్లలో పన్నులు అమల్లో ఉన్నాయి. లగ్జరీ ఉత్పత్తులైన కార్లు, వాషింగ్ మెషిన్లు, పొగాకు ఉత్పత్తులు 28 శాతం శ్లాబులో ఉన్నాయి. సిగరెట్‌లు, పొగాకు, సంబంధిత ఉత్పత్తులు, శీతల పానీయాలపై జిఎస్‌టి పెంచనున్నారనే సంకేతాలు మంగళవారం ఆయా రంగాలకు చెందిన పలు షేర్లు మిశ్రమంగా నమోదయ్యాయి. ఐటిసి షేర్లు ఓ దశలో మూడు శాతం నష్టపోగా.. తుదకు 0.97 శాతం తగ్గుదలతో రూ.472.55 వద్ద ముగిసింది. విఎస్‌టి ఇండిస్టీస్ షేర్ ఉదయం 2.27 శాతం నష్టపోగా.. తుదకు పుంజుకుని 0.71 శాతం లాభంతో రూ.327.85 వద్ద ముగిసింది. వరుణ్ బేవరేజెస్ కంపెనీ షేరు ఇంట్రాడేలో 5.18 శాతం నష్టపోగా.. తుదకు 1.67 శాతం నష్టంతో రూ.621.70 వద్ద ముగిసింది. మరోవైపు వరుసగా మూడో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు

ంలాభాల్లో ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 598 పాయింట్లు లాభపడి 80,846కు చేరింది. ఎన్‌ఎస్ఇ నిఫ్టీ 181 పాయింట్లు పెరిగి 24,457 వద్ద ముగిసింది.

# అప్పుల్లో జియో, ఎయిర్‌టెల్

## షాకిస్తున్న కస్టమర్లు..



దేశంలోని మూడు అతిపెద్ద ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా, ప్రభుత్వ ఆధీనంలోని టెలికాం కంపెనీ బీఎస్‌ఎన్‌ఎల్ అప్పుల పరంగా మెరుగైన స్థితిలో ఉంది. ఇది దాని నెట్‌వర్క్, సబ్‌స్క్రైబర్ బేస్‌లో వేగవంతమైన వృద్ధిని కూడా ఎదుర్కొంటోంది. 2022లో బీఎస్‌ఎన్‌ఎల్ అప్పు రూ.40,400 కోట్లు అని టెలికాం శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ బుధవారం పార్లమెంట్‌లో తెలిపారు.

ప్రస్తుతం రూ.28,092 కోట్లకు తగ్గింది.

దేశంలోని మూడు అతిపెద్ద ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా, ప్రభుత్వ ఆధీనంలోని టెలికాం కంపెనీ బీఎస్‌ఎన్‌ఎల్ అప్పుల పరంగా మెరుగైన స్థితిలో ఉంది. ఇది దాని నెట్‌వర్క్, సబ్‌స్క్రైబర్ బేస్‌లో వేగవంతమైన వృద్ధిని కూడా ఎదుర్కొంటోంది. 2022లో బీఎస్‌ఎన్‌ఎల్ అప్పు రూ.40,400 కోట్లు అని టెలికాం శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ బుధవారం పార్లమెంట్‌లో తెలిపారు. ప్రస్తుతం రూ.28,092 కోట్లకు తగ్గింది. దేశంలోని నాలుగు అతిపెద్ద టెలికాం కంపెనీలు గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,09,905 కోట్ల అప్పులను కలిగి ఉన్నాయి. బీఎస్‌ఎన్‌ఎల్ అత్యల్ప మొత్తం రూ.23,297 కోట్లు. అదే సమయంలో వొడాఫోన్ ఐడియా అత్యధికంగా రూ. 2.07 లక్షల కోట్ల రుణాన్ని కలిగి ఉండగా, భారతి ఎయిర్‌టెల్ రూ.1.25 లక్షల కోట్ల అప్పుతో, జియో ఇన్ఫోకామ్ రూ. 52,740 కోట్ల రుణాలతో ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2022లో బీఎస్‌ఎన్‌ఎల్ అప్పు రూ.40,400 కోట్లు. కంపెనీకి 4 G నెట్‌వర్క్ లేదు. కస్టమర్ల విశ్వాసం కూడా దాదాపు పోయింది. అయితే, వ్యూహాత్మకంగా అదరణ లభిస్తోంది. బీఎస్‌ఎన్‌ఎల్ పునరుద్ధరించాలని ప్రభుత్వం ప్రణాళిక వేసింది. ప్రభుత్వం బిఎస్‌ఎన్‌ఎల్‌కు పునరుద్ధరణ ప్యాకేజీని ఇచ్చింది. దాని కింద కంపెనీ రుణాన్ని రూ.28,092 కోట్లకు తగ్గించింది. టెలికాం మార్కెట్లోకి మళ్లీ ప్రవేశించేందుకు ప్రభుత్వం కంపెనీకి రూ.1.64 లక్షల కోట్ల ప్యాకేజీని కూడా ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో 4జీ నెట్‌వర్క్‌ను అందించే బాధ్యతను బీఎస్‌ఎన్‌ఎల్‌కు అప్పగించారు. ప్రభుత్వం ప్రకారం.. బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ, 5జీ సేవల కోసం 89,000 కోట్ల రూపాయల స్పెక్ట్రమ్‌ను కేటాయించింది. బీఎస్‌ఎన్‌ఎల్ తన నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. బీఎస్‌ఎన్‌ఎల్ సెప్టెంబర్ 2023 నుండి 4జీ నెట్‌వర్క్‌ను ప్రారంభించింది. అలాగే ఈ సంవత్సరం అక్టోబర్ నాటికి, కంపెనీ 50,000 కంటే ఎక్కువ ప్రదేశాలలో 4జీ టవర్‌లను ఇన్‌స్టాల్ చేసింది. వీటిలో 42 వేలకు పైగా పనులు ప్రారంభమయ్యాయి. అదనంగా అన్ని 4 G టవర్‌లు అధునాతన సాంకేతికతలపై ఆధారపడి ఉంటాయి. వీటిని 5జీకి మార్చడానికి నామమాత్రపు ఖర్చు అవుతుంది.



# చైనా పవర్ బ్యాంక్ కంపెనీలపై నిషేధం

నాణ్యత లేని పవర్ బ్యాంక్‌లను విక్రయిస్తున్న రెండు చైనా కంపెనీలపై భారత్ నిషేధం విధించింది. లిథియం బ్యాటరీలను దిగుమతి చేసుకుంటున్న ప్రధాన కంపెనీలపై చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. గ్వాంగ్‌డాంగ్ క్వాసన్ న్యూ ఎనర్జీ టెక్నాలజీ, గన్‌జౌ నావెల్ బ్యాటరీ టెక్నాలజీ లైసెన్స్‌లను రద్దు చేయగా.. గన్‌జౌ టావోయువాన్ న్యూ ఎనర్జీపై విచారణ జరుపుతుంది. చాలా పవర్ బ్యాంక్‌ల కంపెనీలు ప్రకటించిన సామర్థ్యానికి అనుగుణంగా లేవని గుర్తించారు. తొలుత ఆయా కంపెనీలు బిఐఎస్ ఆమోదం కోసం పరిమిత సంఖ్యలో నిబంధనల మేరకు పవర్ బ్యాంకులను తయారు చేసి పంపాయని సమాచారం.

# బీఎస్‌ఎన్‌ఎల్ చీపెస్ట్ రీఛార్జ్ ప్లాన్లు.. రూ.100 కంటే తక్కువ




జియో, ఎయిర్ టెల్ ఇటీవల రీఛార్జ్ ధరలను పెంచిన విషయం తెలిసిందే. ప్రభుత్వ టెలికాం బీఎస్‌ఎన్‌ఎల్ తమ వినియోగదారులను ఆకర్షించుకోవడానికి అత్యల్ప ధరలకు రీఛార్జ్ ప్లాన్‌లను అందిస్తోంది. ఇందులో రూ. 100లోపు అనేక గొప్ప ప్లాన్‌లు ఉన్నాయి. అవేంటో ఒకసారి చూద్దాం.రూ.97 ప్లాన్‌మొదటి ప్లాన్ చూస్తే.. ఈ ప్లాన్‌లో 15 రోజుల చెల్లుబాటుతో వినియోగదారులకు ప్రతిరోజూ 2%+దీ% డేటాను అందిస్తోంది. కాగా, ఇందులో మొత్తం 30 GB డేటా లభిస్తుంది. అంతేకాకుండా.. అన్ని నెట్‌వర్క్‌లలో అపరిమిత కాలింగ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. డేటా పరిమితి అయిపోయిన తర్వాత ఇంటర్నెట్ వేగం 40%ఖఎజూం%కి తగ్గుతుంది.రూ.98 ప్లాన్‌రెండవ ప్లాన్ చూస్తే.. దీని ధర రూ. 98 గా ఉంది. ఈ ప్లాన్ 18 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ప్రతిరోజూ 2%+దీ% డేటాను పొందొచ్చు. ఇందులో మొత్తం 36 GB డేటా వస్తుంది. డేటా పరిమితిని చేరుకున్న తర్వాత వేగం 40 Kbps వద్ద ఉంటుంది.రూ.94 ప్లాన్‌ఇది కేవలం 94 రూపాయలకు 30 రోజుల చెల్లుబాటును అందిస్తోంది. ఈ రీఛార్జ్ ప్లాన్‌లో డేటా కొరత ఉండదు. ఎందుకంటే కంపెనీ ప్రతిరోజూ 3 GB డేటాను ఇస్తోంది. మొత్తం 90%+దీ% డేటాను పొందుతారు.

# బంగారం ధర మళ్లీ పెరిగింది..

దేశీయంగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. తగ్గినట్టే తగ్గిన బంగారం ధర మళ్లీ పైపైకి ఎగబాకుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందామా.. తగ్గిందనుకున్న బంగారం ధర.. మళ్లీ భారీగా పెరగడం మొదలుపెట్టింది. నిన్నటితో పోలిస్తే దేశీయంగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. 24 క్యారెట్ల బంగారం ధర రూ. 430 మేరకు పెరగగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 400 మేరకు ఎగబాకింది. మరి దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందామా.. ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 77,940కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ. 71,460గా ఉంది. ఇక హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, ముంబై, కేరళలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,310గా ఉండగా.. 24 క్యారెట్ల 10



గ్రాముల గోల్డ్ రేటు రూ. 77,790గా కొనసాగుతోంది. బంగారం ధరలు తగ్గినట్టే తగ్గి.. మళ్లీ పెరుగుతుంటే..

వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. గడిచిన రెండు రోజుల్లో సుమారు రూ. 600 మేరకు తగ్గాయి వెండి ధరలు. నిన్న స్థిరంగా కొనసాగిన వెండి ధర.. ఇవాళ రూ. 100 మేరకు తగ్గింది. ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు, ముంబైలో కిలో వెండి రూ. 90,900గా ఉంది. అలాగే హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలో కిలో వెండి రూ. 99,400 కాగా, కేరళ, చెన్నైలో కూడా కిలో వెండి రూ. 99,400గా కొనసాగుతోంది. కాగా, ఈ ధరలు బుధవారం ఉదయం ఆరు గంటలకు నమోదైనవిగా గమనించగలరు.

# ఇక ఏటీఎంల నుంచి పీఎఫ్ డబ్బు విత్‌డ్రా

ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత నిరంతర ఆదాయం కోసం వారి ఉపాధితో పాటు ఈపీఎఫ్‌వోలో పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. ఈపీఎఫ్‌వోలో పెట్టుబడి పెట్టిన మొత్తంలో కొంత భాగాన్ని పదవీ విరమణ తర్వాత పెన్షన్‌గా అందుకుంటారు. ఇప్పుడు ఈపీఎఫ్ఓ నియమాలు మారవచ్చు. ఈ మార్పు తర్వాత పెట్టుబడిదారులు చాలా ప్రయోజనం పొందుతారు. ఈపీఎఫ్‌వో 3.0ని తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఇది అమలులోకి వచ్చిన తర్వాత ఈపీఎఫ్‌వో నియమాలలో చాలా మార్పులు ఉంటాయి. ఈ మార్పుల తర్వాత





పెట్టుబడిదారులు ప్రావిడెంట్ ఫండ్స్ నుండి ఉపసంహరించుకోవడం, పెట్టుబడి పెట్టడంలో మరింత సులభతరం కావచ్చు. ప్రస్తుతం ఉద్యోగులు తమ జీతంలో 12 శాతాన్ని మాత్రమే ఈపీఎఫ్‌కు చేరుతుంది. మీడియా నివేదికల ప్రకారం.. ఈపీఎఫ్‌వో 3.0 ప్రాజెక్ట్ అమలు చేస్తే ఉద్యోగులు తమ సహకారం వాటాను కూడా పెంచుకోవచ్చు. అంటే అతను 12 శాతం కంటే ఎక్కువ పెట్టుబడి పెంచుకోవచ్చు.

# బంపర్ ఆఫర్.. కేవలం రూ.10000 కే 5 G ఫోన్స్

ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ ముగించుకొని బిగ్ బచాట్ డేస్ సేల్‌తో మరోసారి తిరిగి వచ్చింది. ఈ సేల్ లో స్మార్ట్‌ఫోన్‌ల నుండి గాడ్జెట్‌లు, గృహోపకరణాల వరకు ప్రతిదానిపై బంపర్ డిస్కౌంట్లను అందిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త ఫోన్ కొనడానికి ఇదే సరైన సమయం అని చెప్పవచ్చు. ఇక మీ బడ్జెట్ రూ. 10,000 లేదా అంతకంటే తక్కువ ఉంటే, బెస్ట్ 5%+% ఫోన్ కోసం చూస్తున్నట్లయితే.. కొనడానికి ఇదే మంచి సమయం అని చెప్పవచ్చు. అయితే, ఈరోజు సేల్‌లో అందుబాటులో ఉన్న బెస్ట్ 5%+% ఫోన్‌ల గురించి తెలుసుకుందాం.

ఇన్ఫినిక్స్ హాట్ 50 5జి

ఈ డీల్ జాబితాలో మొదటి ఫోన్ గురించి మాట్లాడుతే.. Infinix Ho 50 5+% ఉంది. అయితే, ఈ ఫోన్ లాంచ్ ధర మాత్రం రూ.12,999 ఉండే. దీని ధర ఫ్లిప్ కార్ట్ లో రూ. 9,999 గా ఉంది. దీని ప్రకారం.. ఫోన్‌పై 23% వరకు తగ్గింపు లభిస్తుంది. అంతేకాకుండా.. యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డ్ ద్వారా ఫోన్‌పై రూ.1,000 తగ్గింపు కూడా లభిస్తుంది. ఇక ఈ ఫోన్ ఫీచర్ల గురించి మాట్లాడుతే.. ఫోన్‌లో 4 GB RAM , 6.7 అంగుళాల %ఎణ% ం డిస్‌ప్లే ఉంది. అద్భుతమైన ఫోటల కోసం కెమెరా 48%వీూ% ం డెప్త్ సెన్సార్‌తో 8%వీూ% ఫ్రంట్ కెమెరా ఉంది, బ్యాటరీ గురించి మాట్లాడితే 5000 %ఏూష్ట% బ్యాటరీ కలిగి ఉంది. డైమెన్సిటీ 6300 ప్రాసెసర్ తో అమర్చారు.



## కాంగోలో అంతుచిక్కని వ్యాధితో 143మంది మృతి!

కాంగో: కాంగోలో అంతుచిక్కని వ్యాధితో 143మంది మృతి చెందినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెలువడుతున్నాయి. నైరుతి కాంగోలో రెండు వారాల్లో డజన్ల కొద్దీ ప్రజల మృతికి కారణమైన ఫ్లూ లాంటి వ్యాధిని పరిశీలిస్తున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. క్వాంగో ప్రావిన్స్‌లోని పాంజీ హెల్త్ జోన్‌లో నవంబర్ 10-నవంబర్ 25 మధ్య ఈ మరణాలు నమోదయ్యాయి. జ్వరం, తలనొప్పి, దగ్గు మరియు రక్తహీనత వంటి లక్షణాలు ఉన్నాయని ప్రాంతీయ ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా వారాంతంలో విలేకరులతో అన్నారు. 67-143 మంది మధ్య మరణించారని డిప్యూటీ ప్రావిన్షియల్ గవర్నర్, రెమీ సాకి మంగళవారం అసోసియేటెడ్ ప్రెస్ కు తెలిపారు. ఈ ప్రాంతంలో ఎపిడెమియోలాజికల్ నిపుణుల బృందం నమూనాలను తీసుకొని సమస్యను గుర్తించాలని భావిస్తున్నారని ఆయన తెలిపారు. ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి వైద్య సామాగ్రిని పంపాలని ఆయన జాతీయ,అంతర్జాతీయ భాగస్వాములకు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం,

కాంగో ఇప్పటికే ఎం-పాక్స్ మహమ్మారితో బాధపడుతోంది. సెంట్రల్ ఆఫ్రికన్ దేశంలో 47,000 కంటే ఎక్కువ అనుమానిత కేసులు, 1,000 మందికి పైగా అనుమానాస్పద మరణాలు సంభవించాయి. గుర్తించబడని వ్యాధి గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థకు తెలుసునని, నమూనాలను సేకరించడానికి సంస్థ యొక్క ఒక బృందం క్షేత్రస్థాయిలో స్థానిక ఆరోగ్య సిబ్బందితో కలిసి పనిచేస్తుందని మీడియాతో సంస్థ ఉద్యోగి తెలిపినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది.

# యూన్ రాజీనామా చేయాల్సిందే

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను తక్షణమే రాజీనామా చేయాలని లేదా అభిశంసన ఎదుర్కోవాల్సిందేనని ప్రధాన ప్రతిపక్షం బుధవారం హెచ్చరించింది. ప్రతిపక్షం ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ దేశంలో అత్యవసర సైనిక పాలన విధిస్తున్నట్లు దక్షిణ కొరియా అధ్యక్షుడు టెలివిజన్‌లో ప్రజలనుద్దేశించి ప్రకటించిన సంగతి తెలిసిందే. యూన్‌ను తక్షణమే వైదొలగాలని, లేకుంటే ఆయనకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు 300 సీట్ల పార్లమెంట్‌లో మెజారిటీ వాటాను కలిగి ఉన్న లిబరల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ కొరియా (డిపికె) ప్రకటించింది. "సైనిక పాలన విధిస్తున్నట్లు యూన్ ప్రకటన స్పష్టమైన రాజ్యాంగ ఉల్లంఘన. ఇది ఏ అవసరాలకు కట్టుబడి లేదు" అని డెమోక్రటిక్ పార్టీ ఆ ప్రకటనలో పేర్కొంది. ఆయన ప్రకటన రాజ్యాంగాన్ని తీవ్రంగా ఉల్లంఘించిందని, వాస్తవానికి అది చెల్లదని పేర్కొంది. ఇది తిరుగుబాటు తీవ్రమైన చర్య అని, అభిశంసనకు తగిన ఆధారాలను అందించింది అని తెలిపింది. యూన్‌ను అభిశంసించాలంటే పార్లమెంటులో మూడింట రెండొంతుల మంది లేదా 300 మంది సభ్యులలో 200 మంది మద్దతు అవసరం. డెమోక్రటిక్ పార్టీ మరియు ఇతర చిన్న ప్రతిపక్ష పార్టీలకు కలిపి 192 సీట్లు ఉన్నాయి. అయితే యూన్ సైనిక పాలన తీర్మానాన్ని తిరస్కరిస్తూ పీపుల్స్ పవర్ పార్టీ (పిపిపి)కి చెందిన పది మంది ఓటు వేసినట్లు నేషనల్ అసెంబ్లీ అధికారులు ప్రకటించారు. ఈ పది మంది అభిశంసనకు అనుకూలంగా ఓటు వేస్తే.. యూన్ పదవీచ్యుతుడయ్యే అవకాశం ఉంది. యూన్ అభిశంసను గురైతే .

. రాజ్యాంగ న్యాయమస్థానం తీర్పు ఇచ్చే వరకు ఆయన రాజ్యాంగ అధికారాలు నిలిపివేయబడతాయి. దేశంలో నెం.2 స్థానంలో ఉన్న ప్రధాని హాన్ డక్ సూ అధ్యక్ష బాధ్యతలను చేపట్టాల్సి వుంది.




# నూతన క్రిమినల్ చట్టాలకు బలమైన ముందడుగు

చంఢగీఢ్: తమ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు వలసవాద యుగం నాటి చట్టాల ముగింపునకు బలమైన ముందడుగు అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. వలసవాద యుగం చట్టాలన్ని దురదృష్టవశాత్తూ 'శిక్షాస్పద మనస్తత్వం' చుట్టూ తిరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అభినియ అనే మూడు నూతన క్రిమినల్ చట్టాలను అమల్లోకి తీసుకొచ్చినందుకు గుర్తుగా 'సెక్యూర్ సొసైటీ, డెవలెప్డ్ ఇండియా- ఫ్రం పనిష్‌మెంట్ టూ జస్టిస్' అనే కార్యక్రమాన్ని చంఢగీఢ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ మట్లాడుతూ బ్రిటీష్ వారు తీసుకొచ్చిన భారతీయ శిక్షాస్మృతి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ మొదలైన చట్టాలన్నీ కూడా భారతీయుల్ని శిక్షించడానికి, బానిసలుగా ఉంచడానికి ఉద్దేశించినవే అని విమర్శించారు. విచారకరంగా వాటిని స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా అమలు చేశామని అన్నారు. ఈ ఏడాది జూలై 1 నుంచి పైన తెలిపిన మూడు కొత్త చట్టాలు తీసుకొచ్చామని తెలిపారు.

## తగ్గుముఖం పట్టిన వర్షాలు



చెన్నై: ఫెంగల్ తుపాను కారణంగా గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు మంగళవారానికి తగ్గుముఖం పట్టాయి. బుధవారానికి అల్పపీడనం మరింత బలహీనపడనుందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం రాత్రి నుంచి పశ్చిమ దిశగా ప్రయాణించిన అల్పపీడనం ప్రభావంతో నీలగిరి, కృష్ణగిరి, తిరుప్పూర్, ఈరోడ్, తేని, మదురై జిల్లాల్లో మంగళవారం ఒక మోస్తారు వర్షాలు కురిసాయి. దీంతో సేలం-కోయంబత్తూరు జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించింది. కాగా, ఫెంగల్ తుపాను కారణంగా నష్టపోయిన విల్లుపురం, కడలూరు, కళ్లకురిచి జిల్లాలోని ఒక్కొక్క కుటుంబానికి రూ. 2 వేలు చొప్పున పరిహారం అందచేస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం ప్రకటించారు. అలాగే, బాధిత ప్రాంతాల్లో రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ముమ్మరంగా సహాయక చర్యలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫెంగల్ తుపాను కారణంగా దెబ్బతిన్న తమిళనాడులో సహాయక కార్యక్రమాలు చేపట్టేందుకు రూ. 2 వేల కోట్లు కేటాయిం చాలని ప్రధాని మోడీని ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఈ మేరకు లేఖ రాసారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి నుంచి ఈ సహాయం అందించాలని కోరారు. ఫెంగల్ కారణంగా రాష్ట్రంలో 12 మరది మరణించారని, 2.11 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయని తెలిపారు. దాదాపు 300 ఇళ్లు పూర్తిగా ధ్వంస మయ్యాయి, 963 పశువులు చనిపోయాయని తెలిపారు. అలాగే, సుమారు 9,500 కి.మీ మేర రోడ్లు, 1,847 కల్వర్టులు, 417 చెరువులు దెబ్బతిన్నాయని చెప్పారు. 1,649 కి.మీ విద్యుత్ సరఫరా లైన్లు దెబ్బతిన్నాయి, 997 ట్రాన్స్‌ఫార్మర్లు నిరుప యోగంగా మారయని తెలిపారు. 4,200 అంగన్‌వాడీ కేంద్రాలు, 205 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5,936 పాఠశాల భవనాలు, 381 కమ్యూనిటీ హాళ్లు, 623 నీటి సరఫరా పథకాలు దెబ్బతిన్నాయని లేఖలో తెలిపారు.

## నీటికీ రెగ్యులేటరీ కమిషన్

రాష్ట్ర ప్రజల నెత్తిన ప్రపంచ బ్యాంకు ఆదేశిత పెనుభారం నీటి రెగ్యులేటరీ కమిషన్ రూపంలో పడనుంది. ఇప్పటికే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌తో ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రజలపై ఇది మరో భారంగా మారనుంది. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలను అనుసరిస్తున్న దేశాల్లో ప్రధానంగా నీరు, విద్యుత్‌ను వ్యాపార సరుకుగా మారుస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోనూ వేగంగా దీన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగానే వాటర్ పాలసీని తీసుకొచ్చి దాని అమలు కోసం రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా ఇక నుండి నీటి నిర్వహణను పర్యవేక్షించడం నియంత్రించడం వంటి పనులు చేపట్టనున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న వినియోగపద్ధతులను క్రమబద్ధీకరించేందుకు రెగ్యులేటరీ కమిషన్ అవసరం ఉందని పేర్కొన్నారు. నీటి వినియోగానికి సంబంధించిన అంశాలన్నిటినీ రెగ్యులేటరీ కమిషన్ పర్యవేక్షించే అవకాశం ఉందని, ప్రస్తుత పాలసీలో అంత లోతైన అంశాలు ప్రస్తావించకపోయినా రెగ్యులేటరీ కమిషన్ ఉద్దేశం అదేనని, ఇక నుండి నీటి వినియోగానికి పూర్తి స్థాయిలో డబ్బు వసూలు చేసే అవకాశం ఉందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న సమయంలో ప్రపంచ బ్యాంకు సంస్కరణల్లో భాగంగా నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేసి సాగునీటి మీటర్లు పెట్టి నీటిని లెక్కించాలనే ప్రయత్నం జరిగింది. దీనిపై అప్పట్లో పెద్దయెత్తున వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారు. ఇప్పుడు ఏకంగా రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధపడింది. అదే గనుక జరిగితే రాష్ట్ర ప్రజలపై ఊహించని రీతిలో భారాలు పడవచ్చు.



# బందీలను విడిచిపెట్టండి లేకుంటే నరకం చూపిస్తా

న్యూయార్క్ : హమాస్ చెరలో వున్న ఇజ్రాయిల్ బందీలను తక్షణమే విడుదల చేయాలని, లేకుంటే నరకం చూపిస్తానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ బెదిరించారు. . తాను ప్రమాణ స్వీకారం చేయడానికి ముందే వారిని విడుదల చేయాలని ట్రంప్ హుకుం జారీ చేశారు. ఈ మేరకు ఆయన ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ఇజ్రాయిలీలను బందీలుగా చేయడానికి ఎవరైతే బాధ్యులో వారు కచ్చితంగా మిగిలిన వారికన్నా దెబ్బ తింటారన్నారు. ఈ బెదిరింపులు చూస్తుంటే గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి అమెరికా మరింత ఆజ్యం పోసేలా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. నేరుగా అమెరికా సైన్యం రంగంలోకి దిగుతుందా అన్న అనుమానాలకు ట్రంప్ వ్యాఖ్యలు ఆస్కారమిస్తున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలను ఇజ్రాయెె అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్ స్వాగతించారు.. అమెరికా, ఇజ్రాయిల్‌ల్లో ద్వంద్వ పౌరసత్వం కలిగిన ఒమర్ న్యూట్రా మృతి చెందాడని ఇజ్రాయిల్ ప్రభుత్వం ధ్రువీకరించిన గంటల వ్యవధిలోనే ట్రంప్ ఈవిధమైన బెదిరింపులకు దిగారు.

ఒమర్ న్యూట్రా మృతదేహం ఇంకా హమాస్ అదుపులోనే వుందని భావిస్తున్నారు. తమ విడుదల కోసం ట్రంప్ కృషి చేయాలని అంతకు కొన్ని రోజుల ముందే హమాస్ చెరలో వున్న మరో బందీ ఎడాన్ అలెగ్జాండర్ విజ్ఞప్తి చేశారు.

# పక్కా ప్లాన్ ప్రకారమే సంభాల్ హింస



న్యూఢిల్లీ: పక్కా ప్లాన్ ప్రకారం సంభాల్‌లో హింసకు పాల్పడినట్టు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. మతసామరస్యాన్ని దెబ్బ తీసే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. లోక్‌సభలో జీరో అవర్‌లో సంభాల్‌లో జరిగిన హింసపై ఆయన మాట్లాడారు. మసీదు సర్వే ద్వారా.. గంగా-జమునా తెహజీబ్‌ను దెబ్బతీస్తున్నట్టు ఆయన ఆరోపించారు. ఎక్కడపడితే అక్కడ తవ్వాలనుకునేవాళ్లు.. ఒక రోజు ఈ దేశ సోదరభావాన్ని కోల్పోతారని అఖిలేశ్ హెచ్చరించారు. యూపీ, కేంద్రంలోని బీజేపీ సర్కార్లను ఉద్దేశిస్తూ ఆయన పరోక్ష వ్యాఖ్యలు చేశారు. సంభాల్ హింసలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్టు అఖిలేశ్ ఆరోపణ చేయడంతో సభలో రగడ మొదలైంది. అఖిలేశ్‌కు అండగా పలు ప్రతిపక్ష ఎంపీలు నిలిచారు. అయితే మళ్లీ సభ ఆర్డర్‌లోకి వచ్చిన తరువాత అఖిలేశ్ యాదవ్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ ప్రభుత్వం రాజ్యాంగాన్ని విశ్వసించదని, రాజ్యాంగంపై నమ్మకం లేదని విమర్శిం చారు. యూపీలో నవంబర్ 13న జరగాల్సిన ఉప ఎన్నికలను వాయిదా వేశారని ఆరోపించారు. నవంబర్ 19న మసీదులో సర్వే చేయించి, 20న ఎన్నికలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. నవంబర్ 24న మరోసారి సర్వే చేపట్టారని, ఆ ప్రదేశానికి చేరుకున్న ప్రజలపై సర్కిల్ ఆఫీసర్ లాఠిచార్జ్ చేశాడని, ఆ తరువాత పోలీసులు ఫైరింగ్ జరిపినట్టు అఖిలేశ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో జనం గాయపడ్డారని, దాంట్లో ఐదుగురు మృతిచెందారని, పోలీసులపై మర్డర్ కేసు నమోదు చేయాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. సంభాల్ అల్లర్లు ముందస్తు ప్రణాళికతో జరిగిన కుట్ర అని ఆయన అన్నారు. సంభాల్ జిల్లాలో బీజేపీ సామరస్యానికి విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు. రాజ్యసభలో కూడా ఎస్‌పీ ఎంపీ రాం గోపాల్ యాదవ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ ఘటనను లేవనెత్తారు. దేశంలో అశాంతిని సృష్టించడానికి ప్రణాళికాబద్ధమైన కుట్ర జరుగుతోందని ఆరోపించారు. "సంభాల్ సమస్య ప్రతిరోజూ లేవనెత్తబడుతోంది. ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఇది ముందస్తుగా ప్లాన్ చేసిన కుట్ర కాకపోతే, బుదౌన్, అజ్మీర్ షరీఫ్, జనుపూర్‌లలో అదే జరిగింది. దేశం మొత్తం నిప్పంటించే కుట్ర జరుగుతోంది" అని ఆయన అన్నారు. 500 ఏండ్ల నాటి సంభాల్ మసీదు వద్ద సర్వే చేశారని అన్నారు.

# చైనా సెమీ కండక్టర్ పరిశ్రమపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్ : చైనా సెమీ కండక్టర్ పరిశ్రమను లక్ష్యంగా చేసుకుంటూ అమెరికా కొత్త ఆంక్షలు విధించింది. చిప్‌లను తయారుచేసే నారా టెక్నాలజీ గ్రూప్‌తో సహా 140 కంపెనీలకు ఎగుమతులను నిలిపివేసింది. చిప్ సామాగ్రి, సాఫ్ట్‌వేర్ తదితరాలపై ఆంక్షలతో పాటూ పలు చర్యలు కూడా తీసుకుంది. ఆ పరిశ్రమను అణచివేసే లక్ష్యంతో ఇలా అమెరికా పెద్ద ఎత్తున చర్యలు చేపట్టడమనేది గత మూడేళ్లలో ఇది మూడోసారి. అడ్వాన్స్‌డ్ నోడ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లను తయారుచేసేందుకు అవసరమయ్యే సెమీ కండక్టర్ తయారీ పరికరాలపై కొత్త నియంత్రణలు తీసుకువచ్చారు. ఈ సర్క్యూట్‌లను తయారుచేసే లేదా అభివృద్ధిపరిచే సాఫ్ట్‌వేర్ సాధనాలపై కూడా కొత్త నియంత్రణలు విధించారు. సెమీ కండక్టర్ ఫాబ్రికేషన్ ప్లాంట్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలతో సహా మొత్తంగా 140 కంపెనీలు అమెరికా వాణిజ్య శాఖ జాబితాలో వున్నాయి. ఇవన్నీ కూడా చైనా అధునాతన చిప్ లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు బీజింగ్ తరపున పనిచేస్తాయి. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో అమెరికా, జపాన్, డచ్ తయారీ సంస్థలు రూపొందించే చిప్ తయారీ పరికరాలు చైనాలోని చిప్ ప్లాంట్‌లకు ఎగుమతవకుండా దెబ్బ తీసేందుకు అమెరికా అధికారాలను విస్తరిస్తూ కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. ఇజ్రాయిల్, మలేసియా, సింగపూర్, దక్షిణ కొరియా, తైవాన్‌ల్లో తయారయ్యే పరికరాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. జపాన్, నెదర్లాండ్స్‌ల్లో మినహాయింపు వుంటుంది. విస్తరించిన విదేశీ ప్రత్యక్ష ఉత్పత్తి నిబంధన 16 కంపెనీలకు వర్తించబడుతుంది. ఇవన్నీ కూడా చైనా చిప్ తయారీ కార్యకలాపాలకు అత్యంత కీలకమైనవి.

# నెతన్యాహు వస్తే అరెస్టు చేస్తాం



వెల్లింగ్టన్ : ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు తమ దేశంలోకి ప్రవేశిస్తే వెంటనే అరెస్టు చేస్తామని న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టొఫర్ లక్సన్ ప్రకటించారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు తాము మద్దతిస్తామని ఆయన సోమవారం ఒక పత్రికా సమావేశంలో తెలిపారు. అంతర్జాతీయ న్యాయ వ్యవస్థ పట్ల తమకు నమ్మకం వుందన్నారు. ఐసిసి ఇటీవల నెతన్యాహ, యోవ్ గాలంట్‌లకు అరెస్టు వారంట్లు జారీ చేసిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వారిద్దరు యుద్ధ నేరాలకు పాల్పడ్డారని విమర్శించింది. గత 13 మాసాలుగా గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం సాగిస్తున్నదని, వేలాదిమందిని పొట్టనబెట్టుకుందని ఇవన్నీ మానవాళికి వ్యతిరేకంగా చేపట్టే యుద్ధ నేరాల కిందకే వస్తాయని విమర్శించింది. పాలస్తీనియన్ల రక్షణకు పిలుపునిస్తూ న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడాలు సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేశాయి.

# పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై

## ఫిర్యాదులకు అంతర్గత కమిటీలు



న్యూఢిల్లీ : అన్ని ప్రభుత్వ విభాగాల్లో, సంస్థల్లోని పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసిసి)లను ఏర్పాటు చేస్తూ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 2013లో లైంగిక వేధింపుల నిరోధక (పిఓఎస్‌హెచ్) చట్టం అమల్లోకి వచ్చినా ఇప్పటికీ తీవ్రమైన లోపాలు నెలకొనడం పట్ల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ప్రభుత్వాల స్థాయిలో అధికారుల అలసత్వమే దీనికి కారణమని పేర్కొంది. జాతీయ స్థాయిలో ఈ చట్టానికి అందరూ కట్టుబడి వుండేలా చూసేందుకు ఇటువంటి కమిటీల ఏర్పాటు అవసరమని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. ఈ చట్టం దేశవ్యాప్తంగా ఏకరీతిన అమలు కావాలని కోరింది. డిసెంబరు 31కల్లా ప్రతి జిల్లాలో ఒక ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి వచ్చే ఏడాది జనవరి 31కల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలని, తాలుకా స్థాయిల్లో నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. పిఓఎస్‌హెచ్ చట్టంలోని సెక్షన్ 26 కింద ఐసిసిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సర్వే నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్లు లేదా జిల్లా మేజిస్ట్రేట్లను కోర్టు ఆదేశించింది. వారు ప్రైవేటు రంగ అధికారులతో మాట్లాడి ఐసిసిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటారని, చట్టబద్ధమైన నిబంధలకు కట్టుబడి వుండేలా చూస్తారని సుప్రీం పేర్కొంది.

# రాహుల్, ప్రియాంకలను అడ్డుకున్న పోలీసులు

లక్నో : సంభాల్ జిల్లాకు వెళుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీలను బుధవారం ఉదయం పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీ -మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఘాజీపూర్ సరిహద్దు సమీపంలో వారిని అడ్డుకున్నారు.

రాహుల్, ప్రియాంకల పర్యటన నేపథ్యంలో భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు ఘజియాబాద్ చేరుకోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రతినిధుల బృందం సంభాల్‌లో పర్యటించనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నవంబర్ 24న సంభాల్‌లోని మసీదుపై కోర్టు ఆదేశించిన సర్వే హింసాత్మకంగా మారింది. సర్వేను అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో నలుగురు మరణించారు. దీంతో సంభాల్‌లో బయటి వ్యక్తుల ప్రవేశంతో పాటు పలు ఆంక్షలు విధించింది. గతవారం సమాజ్ వాదీపార్టీకి చెందిన పలువురు ఎంపిలను జిల్లాలోకి ప్రవేశించకుండా పోలీసులు అడ్డుకున్నారు.



## పొట్ట గుట్టలా మారిందా.?

ఊబకాయంతో బాధపడుతున్నారా.? మీ పొట్ట గుట్టలా మారిందా.? జర టెన్షన్ పడకండి.. ఈ అలవాట్లు ఉదయం అల్పాహారం వేళ పాటిస్తే.. మీ పొట్ట కూడా కరిగిపోవాల్సిందే.. ఆ టిప్స్ ఏంటి అంటే.? రోజంతా యాక్టివ్‌గా ఉండాలంటే అల్పాహారం అత్యంత ముఖ్యమైనది. అందువల్ల ప్రొటీన్లు అధికంగా ఉండే అల్పాహారంతో రోజును మొదలుపెట్టాలని వైద్యులు అంటుంటారు. ప్రోటీన్లు మనలో ఆకలిని కంట్రోల్ చేస్తుంది. అల్పాహారంలో గుడ్లు, పెరుగు, చీజ్, పప్పు దినుసులు ఉండాలి. వీటిని తింటే అతిగా తినే అలవాటు తగ్గుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ఉదయాన్నే శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడం వల్ల జీవక్రియ సక్రమంగా ఉంటుందట. రోజంతా క్రమం తప్పకుండా నీరు తాగడం వల్ల బరువు తగ్గడం, శక్తి పెరగడం జరుగుతుంది. రోజూ 34 నుంచి 68 ఔన్సుల నీరు తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. వెచ్చని నీటితో రోజు ప్రారంభించడం ఆరోగ్యానికి చాలా మంచిదని సిఫార్సు చేస్తున్నారు. శరీరానికి అవసరమైన విటమిన్లలో విటమిన్ డి ఒకటి. ఇది సూర్యకాంతి నుంచి వస్తుంది. కాబట్టి ఉదయాన్నే శరీరానికి సూర్యరశ్మి తగలాలి. విటమిన్ డి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. విటమిన్ డి శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ 10 నుంచి 15 నిమిషాలు సూర్యరశ్మిలో ఉండటం వల్ల బరువు తగ్గవచ్చు. రోజువారీ వ్యాయామం చాలా ముఖ్యం. వ్యాయామం చేయడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవచ్చు. ఉదయం వ్యాయామం చేయడం వల్ల శక్తి కూడా పెంపొందుతుంది. ఊబకాయం రాకుండా ఉండాలంటే ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తినాలి. ఇంట్లో వండిన ఆహారం ఏది తిన్నా బరువు అదుపులో ఉంటుంది. అందువల్ల బరువు పెరిగే అవకాశం తక్కువ.

## నీరు ఎక్కువగా తాగడం వల్ల బరువు తగ్గుతుందా..?



హార్వర్డ్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, తగినంత నీరు త్రాగటం బరువు తగ్గడానికి సహాయపడుతుంది. భోజనానికి ముందు నీరు త్రాగడం వల్ల మీరు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది.. దీని ద్వారా అతిగా తినడం నిరోధిస్తుంది. నీరు జీవక్రియను పెంచుతుంది.. కేలరీల బర్నింగ్‌ను వేగవంతం చేస్తుంది. బిజీ లైఫ్, అనారోగ్యకరమైన ఆహారం, తీవ్రమైన ఒత్తిడి.. ఇవన్నీ ఎన్నో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి.. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న బరువు, ఊబకాయం నేడు చాలా మందికి తలనొప్పిగా మారింది. దీని కారణంగా, వారు తమను తాము ఫిట్‌గా, ఫైన్‌గా ఉంచుకోవడానికి అనేక చర్యలు తీసుకుంటున్నారు. కొందరు జిమ్‌కి వెళ్లి వర్కవుట్ చేస్తే మరికొందరు ఇంట్లోనే బరువు తగ్గడానికి మార్గాలను అన్వేషిస్తున్నారు. ఏవేవో డైట్లను అనుసరిస్తున్నారు.. అలాంటి వాటిలో ఒకటి తాగునీరు%ా% నీరు త్రాగడం వల్ల బరువు తగ్గుతుందని, ఫ్యాట్ తగ్గుందని చాలా మంది విశ్వసిస్తారు.. నిజంగా నీళ్లు తాగితే బరువు తగ్గుతారా.? దీని గురించి హార్వర్డ్ నిపుణులు ఏమంటున్నారు..? ఇప్పుడు తెలుసుకోండి. హార్వర్డ్ యూనివర్సిటీ నివేదిక ప్రకారం.. నీరు తాగడం వల్ల బరువు తగ్గడం సులభం అవుతుంది. భోజనానికి ముందు నీళ్లు తాగడం వల్ల బరువు తగ్గవచ్చు. త్వరలోనే దీని ప్రభావం కూడా కనిపిస్తుందని పేర్కొన్నారు.. కానీ బరువు తగ్గాలంటే నీరు త్రాగే సమయాన్ని సరిగ్గా ఉంచుకోవాలి. మీరు తినడానికి కనీసం అరగంట ముందు నీరు త్రాగాలి.. రోజంతా చిన్న మొత్తంలో నీరు త్రాగడం వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు కలుగుతాయి.. ఒకేసారి తాగే బదులు రోజంతా కొంచెం కొంచెం నీరు తాగడం చాలా మంచిది. భోజనానికి ముందు నీళ్లు తాగడం వల్ల కడుపు నిండుతుంది.. ఇది అతిగా తినకుండా చేస్తుంది. చాలా సార్లు ప్రజలు అధిక దాహాన్ని ఆకలిగా భావించి ఎక్కువ తింటారు. అటువంటి పరిస్థితిలో, త్రాగునీరు అతిగా తినడం నిరోధిస్తుంది.. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీరంలో సరైన మోతాదులో నీరు తాగడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. ఇది కేలరీలను వేగంగా బర్న్ చేస్తుంది.. ఇది బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. నీరు త్రాగడం ద్వారా బర్న్ చేయబడిన కేలరీల శాతం..

దాదాపు 30 శాతం పెరుగుతుందని ఒక అధ్యయనంలో తేలింది.

# శరీరంలో ఈ 5 లక్షణాలు కనిపిస్తున్నాయా..?

అధిక కొలెస్ట్రాల్ ఒక తీవ్రమైన వ్యాధి.. దాని లక్షణాలు మొదట కనిపించవు. కానీ కాలక్రమేణా దాని లక్షణాలు శరీరంలో కనిపిస్తాయి. నిర్లక్ష్యం చేస్తే మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది. చెడు కొలెస్ట్రాల్ ఊబకాయంతోపాటు ప్రమాదకరమైన జబ్బుల బారిన పడేలా చేస్తుంది.. అయితే.. చెడు కొలెస్ట్రాల్ సిరల్లో పేరుకుపోతే, మీకు కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని అస్సలు నిర్లక్ష్యం చేయకండి కొలెస్ట్రాల్ ప్రాణాంతకంగా మారుతుంది.. దీని లక్షణాలను నిర్లక్ష్యం చేయడం వల్ల గుండెపోటు వస్తుంది. పక్షవాతం వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది.. అంతేకాకుండా ఊబకాయంతోపాటు ఆరోగ్యాన్ని దెబ్బతీసి ప్రమాదకర జబ్బుల బారిన పడేలా చేస్తోంది.



. అయితే.. కొలెస్ట్రాల్ అనేది కణ త్వచాలలో కనిపించే కొవ్వు, జిడ్డుగల స్టెరాయిడ్.. ఇది రక్త సిరల్లో ఫలకం పేరుకుపోవడానికి కారణమవ్వడంతోపాటు రక్తం సరఫరాకు అడ్డంకిని కలిగిస్తుంది. కొలెస్ట్రాల్ ను రెండు రకాలుగా విభజిస్తారు.. అధిక సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ అంటే మంచి కొలెస్ట్రాల్ అని.. తక్కువ సాంద్రత కలిగిన లిపోప్రొటీన్ అంటే చెడు కొలెస్ట్రాల్ గా పరిగణిస్తారు. చెడు కొలెస్ట్రాల్ సిరల్లో పేరుకుపోతే.. మీకు శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.

వాటిని అస్సలు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.. ఈ క్రింది ఐదు లక్షణాలను గమనించినట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. చెడు కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు, సగం లేదా మొత్తం తల నొప్పి ప్రారంభమవుతుంది. ఇది తీవ్రంగా ఉంటుంది..

అధిక కొలెస్ట్రాల్ ఉన్న రోగులు ఈ లక్షణాలను ఎప్పటికీ విస్మరించకూడదు.. ఎందుకంటే ఈ లక్షణాల కారణంగా తరువాత స్ట్రోక్ భయం ఉంటుంది. అధిక కొలెస్ట్రాల్ ఉన్న రోగులలో కొన్ని నిర్దిష్ట ఛాతీ లక్షణాలు కనిపిస్తాయి. మీరు దీన్ని అనుకోకుండా విస్మరిస్తే మీకు చాలా ప్రాణాంతకంగా మారుతుంది. మీరు ఛాతీ నొప్పి లేదా ఒత్తిడి వంటి ఏవైనా లక్షణాలను అనుభవిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించండి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోవడం ప్రారంభించినప్పుడు, మీ కళ్ళ క్రింద తెల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఈ సందర్భంలో, మీరు వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి. శరీరంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది..


ఊపిరి ఆడకపోవడం లేదా శ్వాస తీసుకోవడంలో ఇతర రకాల ఇబ్బందులు అధిక కొలెస్ట్రాల్ లక్షణం కావచ్చు. ఇది కాకుండా, ఇది అనేక ఇతర తీవ్రమైన వ్యాధుల లక్షణంగా కూడా ఉంటుంది. అకస్మాత్తుగా అలసట లేదా బలహీనంగా అనిపించడం, మైకము, కాళ్లు గుంజడం, నొప్పి, గోర్లు పసుపు రంగులోకి మారడం, పాదాలు చల్లగా ఉండటం కూడా అధిక కొలెస్ట్రాల్ కు సంకేతం..

అంతేకాకుండా తీవ్రమైన అనారోగ్యానికి సంకేతం కూడా కావొచ్చు.. శరీరంలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించండ

# తరుముకొస్తున్న మరో ప్రాణాంతక వైరస్!


మరో పెను ప్రమాదం వైరస్ రూపంలో తరుముకొస్తుంది. ఇప్పటికే ఆఫ్రికాలో దీని బారీన పడి 15 మంది మరణించారు. ఈ వైరస్ కి చికిత్స కూడా అందుబాటులో లేదు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందుతున్న ఈ వైరస్ ను అడ్డుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని WHO ప్రపంచ దేశాలకు హెచ్చరికలు జారీ చేసింది. నిన్న మొన్నటి వరకు కరోనా వైరస్ సృష్టించిన మారణహోమాన్ని ఇంకా పూర్తిగా మర్చిపోకముందే మరో ప్రాణాంతక వైరస్ దాడికి సిద్ధమైంది. అదే బ్లీడింగ్ ఐ వైరస్. ఇప్పటికే 'బ్లీడింగ్ ఐ' వైరస్ రువాండాలో 15 మందిని పొట్టన పెట్టుకుంది. వందలాది మందికి వేగంగా సోకింది. ఇది వెలుగులోకి వచ్చినప్పటి నుంచి గత రెండు నెలల్లో ఏకంగా 17 ఆఫ్రికన్ దేశాలకు వ్యాపించింది. రువాండా, బురుండి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, కాంగో, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, గాబన్, కెన్యా, ఉగాండా, బొలీవియా, బ్రెజిల్, కొలంబియా, క్యూబా, డొమినికన్ రిపబ్లిక్, ఈక్వెడార్, గయానా, పనామా, పెరూ దేశాలకు ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. అంతేకాకండా ఈ ప్రాంతాలకు వెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. బ్లీడింగ్ ఐ వైరస్ అంటే ఏమిటి?.. గతంలో దీనిని మార్బర్గ్ హెమరేజిక్ జ్వరం అని పిలిచేవారు. ఇది ప్రాణాంతక అంటువ్యాధి. ప్టెరోపోడిడే కుటుంబానికి చెందిన రౌసెట్టస్ ఈజిప్టియాకస్ అనే పండ్ల గబ్బిలం నుంచి ఈ వైరస్ వ్యాపిస్తుంది. ఇన్‌ఫెక్షన్ వ్యాపించిన రెండు నుంచి 21 రోజులలోపు ఈ వైరస్ లక్షణాలు బయటపడతాయి. అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, అనారోగ్యంతోపాటు కండరాల నొప్పులు దీని ప్రధాన లక్షణాలు. ఈ వైరస్ సోకిన మూడవ రోజు నుండి విరేచనాలు, కడుపునొప్పి, తిమ్మిర్లు, వికారం, వాంతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 5 వ రోజు నుండి వాంతులు,

మలంలో రక్తం, ముక్కు, కళ్ళు, చెవులు, నోరు, చిగుళ్ళు నుండి రక్తస్రావం అవుతుంది. రోగలక్షణం ప్రారంభమైన ఎనిమిది నుండి తొమ్మిది రోజుల వ్యవధిలో మరణం సంభవిస్తుంది.



బ్లీడింగ్ ఐ వైరస్ సోకిన వ్యక్తుల రక్తం, స్రావాలు, అవయవాలు, ఇతర శారీరక ద్రవాల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. బ్లీడింగ్ ఐ సోకిన రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు కూడా దీని బారీన పడుతున్నారు. రోగిని ప్రత్యక్షంగా తాకినా ప్రాణాపాయమే. బ్లీడింగ్ వైరస్‌కు ఇప్పటి వరకు ఎలాంటి చికిత్స అందుబాటులో లేదు. టీకాలు లేదా యాంటీవైరల్ చికిత్సలు కూడా లేవు. అయితే రీహైడ్రేషన్‌తో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, రోగలక్షణాలను బట్టి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

# ఫూల్ మఖానా తింటే ఈ సమస్యలన్నీ దూరం!



రక్తహీనత సమస్యను దూరం చేయడంలో ఫూల్ మఖానా సహాయపడుతుంది. కీడ్నీల్లోని ఆక్సిడేటీవ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. రాళ్లు ఏర్పడకుండా ఫూల్ మఖానా కాపాడతాయి. ఈ విధంగా ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. తామర గింజలు వేయించి తినడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయి. వీటిని మార్కెట్‌లో ఫూల్ మఖానా అని అమ్ముతారు. ఫూల్ మఖానా చూడడానికి తెల్లగా, గుండ్రంగా ఉంటాయి. ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తామర గింజలు తినడం వల్ల శరీరానికి అనేక పోషకాలు అందుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి అందే పోషకాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తామర గింజలు తినడం వల్ల శరీరానికి అనేక పోషకాలు అందుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వీటిని మార్కెట్‌లో ఫూల్ మఖానా అని అమ్ముతారు. ఈ ఫూల్ మఖానాతో చిరుతిళు ్ల, కూరలను తయారు చేస్తుంటారు. ఇందులో ప్రోటీన్, ఫైబర్ శాతం అధికంగా లభిస్తుంది. ఫూల్ మఖానాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అధిక బరువుతో ఉన్నవారు ఆకలి ఎక్కువగా ఉంటే ఈ మఖానా తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దాంతో పదే పదే తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గుతారు. ఫూల్ మఖానాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల సులభంగా బరువు సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా దీని వల్ల నరాల పనితీరు మెరుగుపడుతుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఫూల్ మఖానాలో మెగ్నీషియం ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఎముకలను, దంతాలను ధృడంగా ఉంచడంలో కూడా ఫూల్ మఖానా మనకు సహాయపడుతుంది. ప్రతిరోజు వీటిని తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు వంటివి తగ్గుతాయి. ఫూల్ మఖానాతో గుండె పనితీరును మెరుగుపరచడంలో ఫూల్ మఖానా ఎంతో మేలు చేస్తుంది. ఇందులోని మెగ్నీషియం, గల్లిక్ యాసిడ్స్ గుండెపోటు వంటి వ్యాధులను తగ్గిస్తుంది. రక్తహీనత సమస్యను దూరం చేయడంలో ఫూల్ మఖానా సహాయపడుతుంది. కీడ్నీల్లోని ఆక్సిడేటీవ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. రాళ్లు ఏర్పడకుండా ఫూల్ మఖానా కాపాడతాయి. ఈ విధంగా ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# దానిమ్మ ఆకులతో ఆరోగ్యం



దానిమ్మ ఆకులులో ఉన్న విటమిన్ సి, ఆంటియాక్సిడెంట్లు జుట్టు, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచటంలో సహాయపడుతాయి. దానిమ్మ ఆకులు జుట్టు ను బలంగా, చక్కని రంగులో ఉంచటంలో సహాయపడుతాయి. దానిమ్మ ఆకులు చర్మాన్ని మెరిసే.. దానిమ్మ ఆకులో విటమిన్ సి, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ పదార్థాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతాయి. రక్తంలో ఉన్న కొలెస్ట్రాల్, ట్రిగ్లిసెరైడ్లను తగ్గించి, రక్తపోటు నియంత్రించడంలో సహాయపడుతాయి. దానిమ్మ ఆకుల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ పదార్థాలు క్యాన్సర్‌కు కాణమయ్యే కణాలను త్వరగా పెరగకుండా ఆపటంలో సహాయపడుతాయి. దానిమ్మ ఆకులు రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పెద్దప్రేగు కాన్సర్ ల చికిత్సలో కూడా సహాయపడుతాయి. దానిమ్మ ఆకుల కషాయాన్ని ఆయుర్వేదంలో కుష్టు వ్యాధి, చర్మ వ్యాధులను నయం చేయడానికి ఉపయోగిస్తారు. దురద, తామర వంటి చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతుంటే దానిమ్మ ఆకులను పేస్ట్ చేసి రాసుకుంటే నయమవుతుంది. అంతేకాకుండా శరీరంపై పుండ్లు, గాయాలు త్వరగా తగ్గుతాయి. రోజుకు రెండుసార్లు తీసుకుంటే, సీజనల్ దగ్గు, జలుబు సమస్య నుండి కూడా ఉపశమనం పొందవచ్చు. అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్, విరేచనాలు వంటి సమస్యలు తరచుగా వస్తుంటే దానిమ్మ ఆకుల రసాన్ని రోజుకు రెండుసార్లు సేవించవచ్చు. అలాగే, చెవి ఇన్ఫెక్షన్లతో బాధపడేవారు దానిమ్మ ఆకులను ఉపయోగించవచ్చు. ఈ ఆకు రసాన్ని నువ్వులు లేదా ఆవనూనెతో కలిపి రెండు చెవుల్లో 2 చుక్కలు వేస్తే చెవి నొప్పి, ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. నోటి దుర్వాసన, చిగుళ్ల సమస్య, నోటిపూత ఉంటే దానిమ్మ ఆకుల రసాన్ని నీళ్లలో కలిపి ఆ నీటితో పుక్కిలించాలి. ఇది నోటి సమస్యలను నివారిస్తుంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332